
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 7 ఆగస్టు 2025

పీఎంశ్రీ స్కూళ్లకు ప్రత్యేక నిధులు

- స్వాతంత్ర్య దినోత్సవం కోసం రూ.25 వేలు మంజూరు

అనంతపురం విద్య, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ (ప్రైమినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) స్కూళ్లలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఈసారి ప్రత్యేక నిధులను కేటాయించారు. విద్యార్థులలో దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని నింపేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఒక్కో పాఠశాలకు రూ.25వేలు మంజూరు చేశారు. ఇప్పటికే ఈనిధుల విడుదలకు ఎస్ఎస్ఏ ప్రాజెక్టు రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులను ఏఏ కార్యక్రమాలకు వినియోగించాలలో కూడా ఆ ఉత్తర్వులలో ఎస్పీడీ తెలిపారు. జాతీయజెండాలు, సౌండ్ సిస్టమ్, పిల్లలకు ఆటలపోటీలు, నాటికల ప్రదర్శనలు, వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్ వంటిపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడానికి ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని 42 పీఎంశ్రీ పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయి. నిధులను ఎస్పీడీ ఉత్తర్వుల మేరకు ఖర్చుపెట్టాల్సి ఉంటుందని ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ తెలిపారు.

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి


జాతీయ జెండాకు వందనం చేస్తున్న డీఎంహెచ్ఓ, ఇతర అధికారులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి పేర్కొన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం డీఎంహెచ్ఓ భవనంపై ఆమె జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. కార్యక్రమంలో ఏఓ గిరిజా మనోహర్ రావు, పలువురు డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డెమో త్యాగరాజు, హెచ్ఈఓ నాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయానికి పదును..!

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు
- కంది, ఆముదం సాగుకు అన్నదాత సన్నద్ధం


బండూరు వద్ద నీట మునిగిన చౌళేకాయ పంట

అనంతపురం అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉపయుక్తంగా మారాయి. ఖరీఫ్ ఆరంభంలో పదును వర్షం లేక ప్రధాన పంట వేరుశనగ అనుకున్న స్థాయిలో సాగు కాలేదు. ఈ వానలకు పదును కావడంతో కంది, ఆముదం విత్తేందుకు రైతులు సిద్ధమయ్యారు.


ఆత్మకూరులో కంది విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉంచిన పొలం

పంటలకు ఊరట

యల్లనూరు మండలంలో పండ్ల తోటల రైతులకు వర్షాలు ఊరటనిచ్చాయి. చీనీ, అరటి, మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలు బోరు బావుల కింద సాగయ్యాయి. ఈ వర్షాలకు బోరు బావుల్లో నీరు పెరుగుతోంది. రాయదుర్గం మండలంలో చెక్‌డ్యాంలు, పంట కుంటల్లో నీరు చేరింది. గుమ్మఘట్ట మండలంలోని గొల్లపల్లి, 75 వీరాపురం పరిసరాల్లో భారీవర్షం కురవడంతో కలుగోడు చెరువుకు నీరు చేరింది. జె.వెంకటాంపల్లి వద్ద బుధవారం ఉదయం ప్రధాన రహదారిపై వరద నీరు పారడంతో రెండుగంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. బొమ్మనహాళ్ మండలంలో బుధవారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. దీంతో వేదవతి హగరి నదితోపాటు వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. కళ్యాణదుర్గం-బళ్లారి కాజ్‌వేపై నీరు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శ్రీధరఘట్ట, గోనేహాళ్, బండూరు, శింగానహళ్లి, కోళగానహళ్లి, లింగదహాళ్ తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. బండూరు, కలుదేవనహళ్లి గ్రామాల వద్ద లోతట్టు ప్రాంతాల్లోని సాగుచేసిన వేరుశనగ, సజ్జ, అనపకాయలు, చౌళేకాయ పంటలు నీట మునిగాయి. బండూరు వద్ద వంక ఉధృతంగా ప్రవహించడంతో విద్యార్థులు బడికి వెళ్లలేదు. ఉద్దేహాళ్ ఉన్నత పాఠశాల, సినిమా థియేటర్ ముందు

(మిగతా 6వ పేజీలో..)


జె.వెంకటాంపల్లి వద్ద ప్రధాన రహదారిపై పారుతున్న వరదనీరు

గుత్తిలో అత్యధికం

జిల్లా పరిధిలో 30 మండలాల్లో మంగళవారం రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా గుత్తి మండలంలో 71.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. పెద్దవడుగూరు 70.4, గుంతకల్లు 68.2, రాయదుర్గం 64.2, పామిడి 53.2, అనంతపురం 48.4, నార్పల 45.4, కళ్యాణదుర్గం 40.4, గుమ్మగట్ట 40.2, విడపనకల్లు 39.0, బెలుగుప్ప 37.2, బుక్కరాయసముద్రం 36.2, శింగనమల 33.6, వజ్రకరూరు 32.6, బ్రహ్మసముద్రం 30.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 27.4 మి.మీ. లోపు వర్షపాతం నమోదైంది. జూన్ సాధారణ వర్షపాతం 61.0 మి.మీ. కాగా 47.9 మి.మీ. నమోదైంది. జూలైలో సాధారణ వర్షపాతం 63.9 మి.మీ. కాగా 34.7 మి.మీ. నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 83.8 మి.మీ. కాగా ఇప్పటి వరకూ 54.3 మి.మీ. నమోదైంది.

బాపూ సంధించిన అస్త్రం.. చేనేత వస్త్రం..

- స్వాతంత్ర్యోద్యమంలో కీలక భూమిక
- ఖాదీ ఉద్యమంతో విదేశీ వస్త్ర బహిష్కరణ
- నేటికీ వన్నె తగ్గని వస్త్రం
- అద్భుత డిజైన్లతో ప్రపంచ వ్యాప్తం
- ధర్మవరం నేతన్నకు ప్రత్యేక గుర్తింపు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం



ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చేనేత మగ్గం చరిత్ర ఎంతో ఘనం. ప్రతి భారతీయుడికి గర్వకారణం. స్వాతంత్ర్య సమరంలో బాపూ వాడిన అద్భుత అస్త్రం చేనేత వస్త్రం. విదేశీ వస్తు బహిష్కరణలో భాగంగా గాంధీజీ రాట్నం వడికారు. అలా.. ఖాదీ ఉద్యమానికి నాంది పలికారు. తద్వారా ఆ నాడే చేనేత వస్త్రానికి ప్రపంచస్థాయి గుర్తింపు దక్కింది. ఆ తర్వాత అందరి మన్ననలు పొందాయి చేనేత వస్త్రాలు. పట్టు చీరలు అన్ని దేశాల మగువల మనసులు దోచాయి. అంతటి చేనేత అంటేనే గుర్తొచ్చేది ధర్మవరం. పట్టుకేంద్రంగా పేరొంది. ఇక్కడి చేనేతల పనితనానికి ఎవ్వరైనా ఫిదా కావాల్సిందే. కాలం మారినా.. ఎన్నో రకాల వస్త్రాలు మార్కెట్‌లోకి దూసుకొస్తున్నా.. చేనేతకు మాత్రం ఆదరణ తగ్గలేదు. కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ చేనేత వస్త్రాన్ని తిరుగులేని విజేతగా నిలుపుతున్నారు. ముడిసరుకుల ధరలు పెరుగుతున్నా.. మగ్గం గిట్టుబాటు కాకున్నా.. వదలట్లేదు. ధర్మవరం నేతన్నల జీవన విధానంగా మగ్గం మారిపోయింది. వంశపారంపర్య వృత్తిగా చేనేతను భావిస్తున్నారు. ధర్మవరం మగ్గంపై పురుడు పోసుకున్న వస్త్రాలను చూస్తే ఎవ్వరైనా మనసు పడేసుకోవాల్సిందే. 1905 ఆగస్టు 7వ తేదీన మహాత్మాగాంధీ రాట్నం తిప్పి, నూలు వడికి స్వదేశీ వస్త్రాన్ని స్వహస్తాలతో రూపొందించారు. దీంతో ఏటా ఇదే తారీఖున జాతీయ చేనేత దినోత్సవం చేసుకుంటారు. దీంతో గురువారం పట్టుకేంద్రం ధర్మవరంలో పెద్దఎత్తున వేడుకలు చేసుకోనున్నారు.

ఖండాంతరాలకు ఖ్యాతి

ధర్మవరం చేనేతల కళానైపుణ్యం అజరామరం. మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అద్భుతడిజైన్లను రూపొందిస్తూ ధర్మవరం పట్టుచీరకు మరింత వన్నె తెస్తున్నారు. ధర్మవరం పట్టుచీర దేశ సరిహద్దులు దాటి ఖండాంతరాలకు వ్యాపించింది. మనిషి వస్త్రధారణ మొదలు పెట్టినప్పట్నుంచి చేనేత నాగరికత ప్రారంభమైందంటే ఎంతటి ప్రాశస్త్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈస్ట్ ఇండియా కంపెనీ ఇక్కడి చేనేత టెక్నాలజీని గుర్తించి వ్యాపారం చేయడానికి ఇండియాకు వచ్చిందంటే చేనేత పరిశ్రమ విశిష్టత ఎంత గొప్పదో ఊహించుకోవచ్చు.

40 వేలదాకా మగ్గాలు

ఉమ్మడి అనంత జిల్లాలో 40వేలదాకా మగ్గాలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి లక్ష మందికిపైగా నేతన్నలు జీవనం సాగిస్తున్నారు. చేనేతలతోపాటు రీలింగ్, ట్విస్టింగ్, డైయింగ్‌లు, డిజైనింగ్‌ల (మిగతా 6లో..)

చేనేతను వీడుతున్న వైసీపీ గ్రహణం

- నేతన్నపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు
- అమలులోకి ఉచిత విద్యుత్
- లిఫ్టింగ్ మిషన్లు మంజూరు
- జీఎస్టీ చెల్లించనున్న ప్రభుత్వం
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

6



దూరవిద్య సప్లిమెంటరీ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ అనిత తదితరులు

అనంతపురంరూరల్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని దూరవిద్య సప్లిమెంటరీ ఫలితాలను బుధవారం వీసీ అనిత, ఎగ్జామినేషన్ కంట్రోలర్ శ్రీరాములు నాయక్ విడుదల చేశారు. దూరవిద్యలో బీఏ, బీకాం, బీకాం కంప్యూటర్స్, బీబీఏ సప్లిమెంటరీ 1, 2, 5 సెమిస్టర్ల ఫలితాలు జనవరిలో నిర్వహించామని వీసీ తెలిపారు. ఫలితాలు ఎస్కేయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చునన్నారు. పునఃమూల్యాంకనానికి ఈనెల 28వ తేదీలోపు డీడీ తీయాలన్నారు. దరఖాస్తులను 30వ తేదీలోగా విశ్వవిద్యాలయంలోని పూలే భవన్‌లో అందజేయాలన్నారు.

బొప్పేపల్లి చెరువుకు హెచ్చెల్సీ నీరు

- జీఓ విడుదల
- ఫలించిన ఎమ్మెల్యే కృషి
- సాకారమైన మండలవాసుల ఏళ్ల కల


బొప్పేపల్లి చెరువుకు వెళ్లే కాలువ

పుట్లూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పేపల్లి రైతుల ఏళ్ల కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి 29వ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా బొప్పేపల్లి చెరువుకు తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) నీటి విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ మేరకు బుధవారం జీఓ విడుదల చేసింది. దీంతో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కృషి ఫలించింది. సుబ్బరాయసాగర్ నుంచి బొప్పేపల్లి చెరువుకు 0.100 టీఎంసీల నీటిని కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. నీరు వస్తే 4వేల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలం అవుతుంది. 17 గ్రామాలకు తాగునీటి సమస్య తీరనుంది. ఆయా గ్రామాల పరిధిలో ఎండిపోయిన బోరు బావులు రీచార్జ్ అయ్యే అవకాశం ఉంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక కాలువ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అప్పట్లో ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో హెచ్చెల్సీ నీరు విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వీటిపై శ్రద్ధపెట్టారు. కాలువపై పదిరోజుల క్రితం కలియతిరిగి సమస్యను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. హెచ్చెల్సీ నీరు బొప్పేపల్లి చెరువుకు విడుదల చేయించేందుకు కృషి చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అంచనాలు తయారు చేయించారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ద్వారా ఆమోదముద్ర వేయించారు. ఆ మేరకు జీఓ విడుదల కావడంతో పుట్లూరు, యల్లనూరు మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బోరుమంటూ..!

బోరుబావులు ఎండిపోవడంతో

చీనీ పంట తొలగించిన రైతు

పెద్దవడుగూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కంటి పాపల చూసుకున్న చీనీ చెట్లు కళ్ల ముందే ఎండిపోతుంటే, కాపాడుకోవడానికి ఆరైతు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కానీ ఫలితం కనబడలేదు. విధిలేని పరిస్థితిలో ఏళ్లతరబడి కన్నబిడ్డలా సాకిన చెట్లను బుధవారం తొలగించాడు. మండలంలోని తెలికి గ్రామానికి చెందిన రైతు షెక్షావలి ఆరేళ్ల కిందట మూడు ఎకరాల్లో చీనీ పంటను సాగు చేశాడు. ఇందు కోసం రూ.1.5 లక్షలు వెచ్చించి బోరుబావి తవ్వించాడు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నీటి తడుల కోసం మరో రెండు బోరుబావులు తవ్వించాడు. వాటిలో చుక్కనీరు లభించలేదు.

నీటి తడులు లేక కళ్లముందే ఎండిపోతున్న చీటి చెట్లను చూసి ఆ రైతు తట్టుకోలేకపోయాడు. ఈక్రమంలోనే వర్షాధార పంటలనైనా సాగు చేసుకుందామన్న ఆశతో యంత్ర పనిముట్ల ద్వారా బుధవారం చీనీ చెట్లను తొలగించాడు. చీనీ పంట సాగుకు ఇప్పటివరకు రూ.8లక్షలు పెట్టుబడి పెట్టినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.


తొలగించిన పంట వద్ద రైతు షెక్షావలి

కమలపాడు విద్యుత్ ప్రాజెక్టుకు 254.9 ఎకరాల ప్రభుత్వ భూమి

యాడికి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేయనున్న కమలపాడు పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టుకు 254.903 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కమలపాడు, కుందనకోట రెవెన్యూ పంచాయతీల పరిధిలో భూముల ముందస్తు స్వాధీనానికి సంబంధించిన ఉత్తర్వులను జెన్‌కో అధికారులకు బుధవారం అప్పగించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. 950 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు స్థాపనకు కుందనకోట గ్రామంలో 179.523, కమలపాడు పరిధిలో 75.38 ఎకరాల ప్రభుత్వ భూములను ఏపీ జెన్‌కోకు కేటాయించినట్లు తెలిపారు. భూముల స్వాధీనానికి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ శేషసాయి, విలేజ్ సర్వేయర్ మౌలాలీ, గ్రామ రెవెన్యూ అధికారి భీమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.


జెన్‌కో అధికారులకు ప్రభుత్వ భూమి స్వాధీన పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్

అమ్మా.. ఇక సెలవ్..! సెంట్రల్ బ్యాంకు ఉద్యోగి ఆవేదన.. అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్య.. (7లో...)

నాటుసారాకు నెలాఖరులోగా చెక్

- డీసీ నాగమద్దయ్య


మాట్లాడుతున్న నాగమద్దయ్య

అనంతపురం క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నాటు సారాను నిర్మూలించి, ఈ నెలాఖరులోగా నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. అనంతపురం సూపరింటెండెంట్ కార్యాలయంలో ఏసీ చంద్రశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ రామ్‌మోహన్‌రెడ్డితో కలసి జిల్లాలోని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, బార్డర్ పెట్రోలింగ్ పార్టీ ఇన్‌స్పెక్టర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 31లోపు నాటు సారా రహిత గ్రామాలుగా ప్రకటించాలని, నవోదయం 2.0ను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని అన్నారు. గ్రామాల్లో పాత కేసుల నిందితులు ఉంటే వెంటనే అరెస్టు చేయాలని సూచించారు. ఎక్కడా నాటు సారా తయారీ, రవాణా లేకుండా చూడాలని అన్నారు. సరిహద్దు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, బార్డర్ పెట్రోలింగ్ పార్టీ ఇన్‌స్పెక్టర్లు కర్ణాటక మద్యం జిల్లాలోని రాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, జయనాథ్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

డీపీ.. కూపీ..!

- ప్రియురాలి భర్తను హత్య చేసిన ప్రియుడు
- కేసు ఛేదింపులో కీలక ఆధారం వాట్సాప్ డీపీ
- ఆమె పేరు.. తన పేరులో తొలి అక్షరాలను కలిపి వివాహేతర ప్రేమ బంధం సింబల్



అనంతపురం క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరశివారు ప్రాంతం. వేకువజాము. పొలం గట్టు. ప్రశాంత వాతావరణం. ఉన్నఫలంగా మర్డర్ వార్త. అటు పోలీసులు, ఇటు పల్లె జనాల్లో అలజడి. శరీరంపై పోట్లు, ఛిద్రమైన తలభాగం. రక్తపు మడుగులో మృతదేహం. ఇదీ జూన్ 25వ తేదీ రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీలోని సదాశివ కాలనీ ప్రాంతంలో కనిపించిన దృశ్యాలు. ఈ ఉదంతంతో అనంతపురం రూరల్ డీఎస్పీ నుంచి రూరల సీఐ, ఎస్ఐ వరకూ అందరూ పరుగులందుకున్నారు. దర్యాప్తు ప్రారంభించి ఆరు గంటల్లో నిందితుల ను పట్టుకొచ్చారు. ఈ హత్య కేసు ఛేదింపు వెనుక ఆసక్తికర విషయాలు కనిపిస్తాయి. ఒక హత్య, రెండు బొమ్మలు, 30 కిలోమీటర్ల ప్రయాణం ఇవీ హత్య కేసులో కీలక మలుపులు.

వాట్సాప్ డీపీతో..

రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీలోని సదాశివ కాలనీలో ఉంటున్న సురేష్ బాబు(43)ను గుర్తుతెలియని వ్యక్తులు ఈ ఏడాది జూన్ 25 హత్య చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఆరుగంటల్లోనే నిందితులను పట్టుకొచ్చారు. అయితే ఈ హత్య కేసు ఛేదింపులో ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. దర్యాప్తులో భాగంగా అనంతపురం రూరల్ పోలీసులు సదాశివ కాలనీలో మృతుడి భార్య, స్థానికులను ఆరా తీసి కొంత సమాచారం రాబట్టారు. హత్య వెనుక వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానించారు. మృతుడి భార్య అనితను గట్టిగా ప్రశ్నించారు. ఆమె ప్రియుడు బాబా ఫకృద్దీన్(37) ఈ హత్య చేసినట్లుగా అనుమానిం చారు. పోలీసులు అతడి సెల్‌ఫోన్ నంబర్ ద్వారా వాట్సాప్ డీపీ చూశారు. డీపీపై ఏబీ అనే ఆంగ్ల అక్షరాలు లవ్ సింబల్‌తో ముడిపడి ఉండటం గుర్తించిన పోలీసులకు విషయం మొత్తం అర్థం అయ్యింది.
మృతుడి భార్య పేరు అనిత, ఆమె ప్రియుడి పేరు బాబా ఫకృద్దీన్ కావడంతో ఇద్దరి పేర్లలోని మొదటి ఆంగ్ల అక్షరాలు ఏబీ వచ్చేలా లవ్ సింబల్ రూపొందించారని ధ్రువీకరించుకున్నారు. తర్వాత ఆ నెంబర్‌ను ట్రేస్ చేసే పనిలో పడ్డారు. ఇదంతా గంటల వ్యవధిలోనే జరిగింది.


ఆటోపైనా ఏబీ అక్షరాలతో లవ్ సింబల్

సిగ్నల్ ఆధారంగా 30 కిలోమీటర్ల ప్రయాణం

సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడిని పట్టుకోడానికి పోలీసులు 30 కిలోమీటర్లు ప్రయాణం మొదలెట్టారు. అనంతపురం నుంచి కూడేరు మీదుగా కరుట్లపల్లికి చేరుకున్నారు. అక్కడ ఓ కాలనీ వైపు అడుగేశారు. వాళ్లు వెళ్లిన ప్రాంతంలోనే ఒక ఆటో నిలిచి ఉంది. ఆ ఆటోపై కూడా వాట్సాప్ డీపీలో ఉన్న ఫొటోనే ఉండటంతో పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ ఆటోకు సమీపంలోని ఇంట్లోకి వెళ్లి వెతికారు. అక్కడే ఉన్న నిందితుడికి గట్టిగా కౌన్సెలింగ్ ఇవ్వడంతో మొత్తం కక్కేశాడు. మృతుడు సురేష్ భార్యతో తనకు సాన్నిహిత్యం ఉందన్నారు. ఆమె చెప్పడంతోనే 24న రాత్రి 11 గంటలప్పుడు ఇంటికి వెళ్తున్న సురేష్‌పై అక్కంపల్లి- రాచానపల్లి మధ్యలో నల్లలమ్మ గుడి సమీపంలో ఖాళీ సీసాతో అటాక్ చేశానన్నాడు. తర్వాత తన వెంట తెచ్చుకున్న స్క్రూడ్రైవర్‌తో పొడిచి, తర్వాత బండ రాయితో కొట్టి చంపి పరారైనట్లు పోలీసులకు వివరించాడు. ఈ కేసు దర్యాప్తు వాట్సప్ డీపీతో మొదలై...అదే బొమ్మతోనే ముగిసింది. టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కే ఈ కాలంలో చిన్న క్లూ దొరికినా కొండను తవ్వైనా పోలీసులు నేరస్థులను పట్టేస్తారనడానికి ఇది ఓ ఉదాహరణ.

చేనేతను వీడుతున్న వైసీపీ గ్రహణం



అనంతపురం వైద్యం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత రంగంపైనే అధికంగా ఉపాధి పొందుతున్నారు. ఈ రంగంపై ఆధారపడ్డ వారిని ప్రోత్సహించేలా పట్టు రాయితీ, ఆరోగ్య పథకం, పింఛన్, బ్యాంకు రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించేవి. వాటిని సద్వినియోగం చేసుకుని దేశ, విదేశాలకు చేనత వస్త్రాలను ఎగుమతి చేసేస్థాయికి నేతన్నలు ఎదిగారు. 60 ఏళ్లలోపు వయసుగల చేనేత మరణిస్తే రూ.60 వేల తక్షణ ఆర్థిక సాయం కూడా అందేది. వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్నిరకాల సంక్షేమ పథకాలను రద్దు చేయడంతో చేనేత రంగానికి గ్రహణం పట్టిందని నేతన్నలు గుర్తు చేసుకుంటున్నారు. కొందరికి మాత్రమే నేతన్న నేస్తం పేరుతో ఏడాదికి రూ.24వేలు చెల్లించి, చేతులు దులుపుకున్నారని మండిపడుతున్నారు. 5 శాతం జీఎస్టీని మోపుతూ నడ్డి విరిచారని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో చేనేత రంగానికి మళ్లీ మంచి రోజులొచ్చాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చేనేత మగ్గాలున్న ఒక్కో కుటుంబానికి నెలకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందించనున్నారు. పవర్‌లూమ్ ఫ్యామిలీకి కూడా 500యూనిట్ల వరకు ఉచితంగా అమలు చేయనున్నారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వమే జీఎస్టీని చెల్లించనుంది. ఈ పథకాలను గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. దీంతో చేనేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని పథకాలు రద్దు...

60 సంవత్సరాల్లోపు వయసు గల చేనేత కార్మికుడు మృతి చెందితే బాధిత కుటుంబానికి రూ.60వేల తక్షణ ఆర్థిక సాయం అందించేవారు. ప్రత్యేక ఆరోగ్య పథకం కింద ప్రతి చేనేతకు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించేవారు. ఐపీకి రూ.15వేలు, ఓపీకి రూ.7వేల చొప్పున ప్రభుత్వమే భరించేది. చేనేత మగ్గం నేయలేని వృద్ధులకు ప్రత్యేక పింఛన్ వచ్చేది. చేనేత వస్త్రాల తయారీకి అవసరమైన ముడిసరుకు కొనుగోలుకు రాయితీ చెల్లించేవారు. వస్త్రాల అమ్మకాలను ప్రోత్సహించేలా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయించేవారు. 2019లో కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వం వీటన్నింటినీ రద్దు చేసింది. దీంతో చేనేత రంగం కుదేలైందని నేతన్నలు వాపోతున్నారు.

5,632 కుటుంబాలకు ఉచిత విద్యుత్

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో చేనేత రంగం మళ్లీ పట్టాలెక్కనుంది. చేనేత కుటుంబాలకు ఆర్థిక భారాన్ని తగ్గించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపింది. ఇందులో భాగంగా జిల్లాలోని 5,632 చేనేత కుటుంబాలకు 200యూనిట్ల చొప్పున ఈనెల 1వ తేదీ నుంచే ఉచిత విద్యుత్ అందిస్తోంది. పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల చొప్పున ఉచితంగా ఇవ్వనుంది. అధికంగా విద్యుత్‌ను వినియోగించుకున్నా నిర్దేశించిన యూనిట్లకు ప్రభుత్వమే బిల్లు చెల్లిస్తుంది. 5శాతం జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది.

లిఫ్టింగ్ మిషన్లు, వర్క్‌షెడ్లు...

ఉచిత విద్యుత్, జీఎస్టీతోపాటు నేతన్నలకు మగ్గం పరికరాలను అందజేయనుంది. ఒక్కో మగ్గానికి పవర్ లిఫ్టింగ్ మిషన్ అందజేస్తున్నారు. రూ.1.20 లక్షలతో ప్రభుత్వమే వర్క్‌షెడ్లను మంజూరు చేయనుంది. సొసైటీలో సభ్యులైన నేతన్నల చేనేతల ఉత్పత్తుల అమ్మకాల ద్వారా వచ్చిన అదాయానికి థ్రిఫ్టింగ్ ఫండ్ ఇవ్వనుంది. ఆదాయంలో 8శాతం నేతన్న చెల్లిస్తే.. ఆ మొత్తానికి 16శాతం కలిపి రాష్ట్ర ప్రభుత్వమే తిరిగి నేతన్నకు చెల్లించనుంది. ఇలా అనేక రకాల వెసులుబాట్లను రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

10 వేల మంది నేతన్నలు



జిల్లాలో 10వేల మందివరకు నేతన్నలు మగ్గాలు నేస్తున్నారు. 5,632 కుటుంబాలు ఈ రంగంపైనే ఆధారపడ్డాయి. ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనుంది. వర్క్‌షెడ్లు, లిఫ్టింగ్ మిషన్ తదితర పరికాలను ప్రభుత్వం మంజూరు చేయనుంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం అనంతపురంలో నిర్వహించే ర్యాలీకి పెద్దసంఖ్యలో నేతన్నలు, సంఘాల నాయకులు తరలి రావాలి.

-వరప్రసాద్, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి, అనంతపురం

నేతన్నలకు వరం



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలు నేతన్నలకు వరం కానున్నాయి. ఉచిత విద్యుత్ రూపంలో నెలకు రూ.వెయ్యికిపైగా ఆర్థిక సాయం అందినట్లే. రూ.1.25లక్షల వర్క్‌షెడ్, రూ.21వేల విలువైన లిఫ్టింగ్ మిషన్ తదితర పరికరాల రూపంలోనూ చేనేతలకు ఆర్థిక భారం తగ్గనుంది.

-నరసింహులు, శ్రీరామానంద చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



చేనేత బ్యాంకు, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.5లక్షల వరకు నేతన్నలకు వ్యక్తిగత రుణాలివ్వాలి. పట్టురాయితీ, చేనేత పింఛన్లు, లూబ్ బార్డ్, పునకర్ యోజన, ఇంటి స్థలాలు తదితర పథకాలను చేనేత రంగంలోని అందరికీ వర్తింపజేయాలి.

-నీలూరి రుషింగప్ప, జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రాయితీలకు మంత్రి మండలి ఆమోదం

పుట్టపర్తి, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): చేనేతలకు పలు రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఈ-క్యాబినెట్ భేటీలో చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందించే పథకానికి ఆమోదం తెలిపింది. చేనేత ఉత్పత్తుల జీఎస్టీపై రాయితీ ఇవ్వనుంది. థ్రిఫ్ట్ ఫండ్ పథకం అమలుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్.. కింద చేనేత వస్త్రాలకు రాష్ట్రానికి 10 అవార్డులు లభించగా.. మొదటి సారిగా ధర్మవరం పట్టు చీర రాష్ట్ర అవార్డులు గెలుచుకుంది. పుట్టపర్తిలో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టును రెగ్యులర్ ప్రాతిపదికన నియమించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

చేనేత దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరిగేటు వద్ద గల నేతన్న విగ్రహం సమీపంలో జాతీయ చేనేత దినోత్సవం జరపడానికి చేస్తున్న ఏర్పాట్లను ఆర్డీఓ మహేశ్ బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, జిల్లా కలెక్టర్ చేతన్ హాజరవుతారన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీఓతోపాటు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, తహసీల్దార్ సురేశ్‌బాబు పర్యవేక్షించారు. చేనేత రంగ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని, నేతన్నల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలులో ఉన్నాయని హరీశ్‌బాబు అన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేశ్, నాయకులు

బాపూ సంధించిన అస్త్రం..

చేనేత వస్త్రం..

(5వ పేజీ తరువాయి)

వారు కూడా దీనిపై అధారపడి జీవిస్తున్నారు. చేనేత రిజర్వేషన్ చట్టంలోని లొసుగుల వల్ల మరమగ్గాలు విచ్చలవిడిగా వెలసినా.. నేతన్న నేసిన పట్టుచీరకు ఇప్పటికీ గిరాకీ ఉండటం కళానైపుణ్యానికి నిదర్శనం. ప్రస్తుతం నేతన్న నేసిన చీరను కొనుగోలు చేయడానికి వ్యాపారులు పోటీపడుతుండటం విశేషం.

డిజైనింగ్‌లో ఎదురేలేదు..

చేనేత పట్టుచీరకు డిజైనింగ్ ఎంతో ముఖ్యం. నూతన టెక్నాలజీని జోడించి పట్టుచీరల డిజైన్లు రూపొందించడంలో ధర్మవరం డిజైనర్లు పోటీ పడుతున్నారు. డిజైనింగ్‌లో తమకు సాటిలేరని నిరుపించుకుంటున్నారు. ఇప్పటికే మయూరి, పద్మారవింద, స్వర్ణకమలం, బ్రహ్మకమలం, గంధం, త్రీడీ, సుమాంజలి, కళాంజలి తదితర చీరలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఇక్కడి డిజైనర్లు మరో అడుగు ముందుకేసి దేవుళ్ల, దేవతల ప్రతిమలు, జాతీయ, అంతర్జాతీయ నేతలు, ప్రముఖులు, మేధావుల ప్రతిమలను వివిధ రూపాల డిజైన్లను పట్టు వస్త్రంపై రూపొందిస్తున్నారు.

భౌగోళిక గుర్తింపు

ధర్మవరం పట్టుపరిశ్రమ ప్రపంచ ఖ్యాతి గడించడంతో భారత ప్రభుత్వం భౌగోళిక గుర్తింపును 2014లో కల్పించింది. ఇక్కడ తయారుచేసే పావడాలు, పట్టుచీరలకే ఈ గుర్తింపు దక్కింది. ప్రాచుర్యం పొందిన పరిశ్రమను మరింత ప్రోత్సాహించాలన్న ఉద్దేశంతోనే ఈ గుర్తింపు కల్పిస్తారు. నేతన్నలు తయారుచేసిన పావడా, పట్టుచీరకు గుర్తింపునివ్వడం వల్ల పవర్‌లూమ్స్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ధర్మవరం చీరకు పేరు తీసుకొస్తా



పట్టుచీరల డిజైనింగ్‌పై ఉన్న మక్కువతో బెంగళూరు, హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నా. చేనేత కార్మికుడి సత్తాను జాతీయస్థాయిలో చాటాలనుకున్నా. ఇప్పటికే పలు డిజైన్లు రూపొందించి, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నా. ధర్మవరం పట్టుచీరకు మంచి పేరు తీసుకురావాలన్నదే నా చిరకాల కోరిక.

- నాగరాజు, డిజైనర్, ధర్మవరం

మేడం గారు మరి..!

గురుకుల పాఠశాలలో అవినీతి అధికారి

- అక్రమ వసూళ్లలో చెలరేగుతున్న వైనం
- పైసలిస్తే చాలు.. విధులకు రాకున్నా ఓకే
- సీటు డిమాండ్‌ను బట్టి డబ్బు వసూళ్లు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు



గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న రిటైర్డ్ ఉద్యోగి

బత్తలపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాలలో ఓ మేడం అవినీతికి హద్దు లేకుండా పోతోంది. యథేచ్ఛగా సీట్లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో పని చేసే ఓ నాన్ టీచింగ్ ఉద్యోగి నాలుగేళ్లుగా విధులకు రాలేదు. కానీ హాజరైనట్లు సంతకాలు మాత్రం ఉంటున్నాయి. ఆ ఉద్యోగి స్థానంలో ఓ రిటైర్డ్ ఉద్యోగిని నియమించుకుని పనులు చేయిస్తున్నారు. ఇందుకు గాను విధులకు డుమ్మా కొట్టిన ఉద్యోగి నుంచి భారీగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈనేపథ్యంలో మూడు నెలల కిందట ఓ నిరుద్యోగి గురుకుల పాఠశాలలో జరుగుతున్న అక్రమ వ్యవహారాలపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. వీటిపై విచారించి, నివేదిక ఇవ్వాలని కింది స్థాయి అధికారులను ఆదేశించినా, వాటిని కూడా తొక్కి పెట్టేశారన్న విమర్శలు ఉన్నాయి.

సొమ్ములిస్తేనే సీటు!

ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలల్లో విద్యనందిస్తూ, సౌకర్యాలు కల్పిస్తోంది. దీంతో ఆ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు మంచి డిమాండ్ ఉంటోంది. ఇదే ఆ మేడంకు కలిసివస్తోంది. తనకు అనుకూలంగా ఉండే పాత విద్య కమిటీలోని ఒకరిద్దరిని బ్రోకర్లుగా ఏర్పాటు చేసుకొని డిమాండ్‌ను బట్టి అడ్మిషన్‌కు భారీగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎవరైనా ఇంత పెద్ద మొత్తమా అని అడిగితే మీరు ఒక సారి ఇస్తే ఆరేళ్లు పైసా ఖర్చు ఉండదు కదా అని దబాయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆమె అడిగినంత ఇచ్చి పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల సిఫార్సులను సైతం బుట్టదాఖలు చేస్తున్నారనే ఆరోపణలు ఆ మేడంపై ఉన్నాయి. కొత్త విద్యా కమిటీని డమ్మీని చేసి, యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ పాఠశాలలో ప్రిన్సిపాల్ సహా 16 మంది బోధనా సిబ్బంది ఉన్నారు. 300మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. 5, 6, 7 తరగతులకు రెండేసి సెక్షన్లు ఉన్నాయి. 8, 9, 10 తరగతులకు మాత్రం ఒక్కో సెక్షన్ ఉన్నాయి.

అభివృద్ధి పేరుతో అక్రమ వసూళ్లు

పాఠశాలలో షెడ్లు వేయాలని, మరుగుదొడ్లు మరమ్మతులు చేయించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులతో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వసూలు చేసిన డబ్బులతో ఇప్పటివరకు ఒక్క పని కూడా చేయలేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా విద్యార్థుల తల్లిదండ్రులతో ఒక్కొక్కరి నుంచి రూ.5వేల నుంచి 10వేల వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన ఏడాదికి భారీగానే అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఈ వ్యవహారాలన్నీ తెలిసినా మండల విద్యాశాఖ అధికారులు మాత్రం తెలియనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

గుట్టు రట్టు అవడంపై ఫైర్

'మన స్కూల్లో సీట్లు అమ్ముకునే విషయం పాఠశాల పరంగా నీకు నాకు తప్ప మరెవరికి తెలియదు. ఈ విషయం బయటకు ఎలా పొక్కింది? మీరే బయట చెప్పి ఉంటారు' అంటూ ఓ టీచర్‌పై అవినీతి మేడం ఫైర్ అయినట్లు సమాచారం. వారం కిందట ఓ ప్రజాప్రతినిధి కార్యాలయం నుంచి మేడంకు ఫోన్ చేసి, 'మీపై అవినీతి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ ఏడాది ఎవరెవరు పాఠశాలలో చేరారో వారి అడ్రస్సులతో పాటు, మిగిలిన సీట్ల వివరాలు రాత పూర్వకంగా ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈక్రమంలోనే సీట్ల అమ్మకాలకు సహకరిస్తున్న ఉద్యోగిపై మేడం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గురుకుల పాఠశాలలో అవినీతిని నిర్మూలించాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా బత్తలపల్లి పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై మహాత్మాజ్యోతీరావు పూలే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ జమునను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.



మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల

టమోటా కిలో రూ.47

అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం కిలో టామోటాలు గరిష్టంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ట ధర రూ.30, సరాసరి ధర రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,750 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.



ప్రత్యామ్నాయానికి పదును..!

(5వ పేజీ తరువాయి)

భారీగా నీరు నిలిచింది. నంబులపూలకుంట మండలంలో ఎండుతున్న పంటలకు వర్షం ప్రాణం పోసింది.

కూలిన మిద్దె



కూలిన కదిరెప్ప మట్టి మిద్దె

అనంతపురం రూరల్ మండలం చియ్యేడులో బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కదిరప్పకు చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కదిరప్ప, ఆయన భార్య అక్కమ్మ బంధువుల ఇంట్లో పడుకున్నారు. దీంతో వారికి ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న సామగ్రి ధ్వంసమైంది. రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధిత కుటుంబం తెలిపింది. ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించింది.

1.42 లక్షల హెక్టార్లల్లో సాగు

ఖరీఫ్‌లో ఈ ఏడాది అనంతపురం జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లులుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లు, కంది 55296, పత్తి 44వేలు, ఆముదం 16293, వరి 19466, జొన్న 1719, సజ్జ 2054, మొక్కజొన్న 14653, రాగి 69, కొర్ర 3311, పెసలు 455 హెక్టార్లు. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలున్నాయి. కానీ జూన్, జూలైలో వానలు కురవక 1.42 లక్షల హెక్టార్లలో (42 శాతం) మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 49,518 హెక్టార్లు ఉంది. మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, ఆముదం, పత్తి, సజ్జ వేశారు. ఈ సారి కంది సాగుకు ఆసక్తి చూపారు. కంది సాధారణ సాగు విస్తీర్ణం 55,296 హెక్టార్లు కాగా.. ఇప్పటి దాకా 55,290 హెక్టార్లల్లో సాగైంది. తాజా వర్షాలకు మరింత విస్తీర్ణంలో పంట సాగయ్యే అవకాశం ఉంది.

కంది సాగు చేస్తా..



నాకు ఐదెకరాల పొలం ఉంది. పదును వర్షం పడకపోవంతో విత్తనం వేయలేదు. జూలై నెలాఖరు ఎదురుచూసినా వర్షం కురవలేదు. కంది విత్తనాలు సిద్ధం చేసుకున్నాను. ఇప్పుడు పదునైంది. తేమ ఆరగానే కంది పంట సాగు చేస్తాను.

-వన్నూరుస్వామి, పి.సిద్ధరాంపురం, ఆత్మకూరు మండలం

ఆశలు చిగురించాయి



నాకు పదెకరాల పొలం ఉంది. ఏటా వేరుశనగ పంట సాగు చేసి నష్టపోతున్నాను. అందుకే గత ఏడాది నుంచి కంది సాగు చేస్తున్నా. ఈ ఏడాది కంది పంటకు అనుకూలమైన వర్షం పడలేదు. అందుకే విత్తనం వేయలేకపోయారు. బీడు పెట్టుకోవాల్సిందే అనుకున్నాను. కానీ రెండు రోజులుగా వర్షం పడుతోంది. తేమ ఆరగానే పదెకరాల్లో కంది పంట వేస్తాను.

-ఓబుళపతి, ఆత్మకూరు

ఈనెల 15 వరకు అదును..



వేరుశనగ సాగుకు అదును దాటిపోయంది. ఈ నెల 15 వరకూ కంది, ఆముదం పంటలు సాగు చేయవచ్చు. ఈ నెల 9 వరకూ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. పొలాల్లో తేమ ఆరిన తర్వాత కంది, ఆముదం విత్తుకోవాలి. ఈ నెల 15 దాటితే కొర్ర, ఉలవ, సజ్జలు, పెసర తదితర పంటలు సాగు చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

-చంద్రాయుడు, కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త

స్కూళ్లకు చేరుతున్న ఆన్సర్‌షీట్లు



యల్లనూరు మండలంలోని పాఠశాలకు అందజేస్తున్న ఆన్సర్ షీట్లు

అనంతపురం విద్య, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో నిర్వహించే పరీక్షలకు సంబంధించిన అసెస్ మెంట్ ఆన్సర్‌షీట్స్ స్కూళ్లకు చేరుతున్నాయి. ఒక్కో విద్యార్థికి ఒక్కో అసెస్‌మెంట్ ఆన్సర్ షీట్‌ను బుక్‌లెట్ రూపంలో ఇవ్వనున్నారు. ఆయాతరగతుల విద్యార్థులు పరీక్షలు ఎపుడు పెట్టినా ఈ ఆన్సర్ షీట్ బుక్‌లెట్‌లోనే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. విద్యార్థులు పరీక్షలు రాసిన తర్వాత సంబంధిత క్లాస్ టీచర్ ఆన్సర్‌షీట్ బుక్‌లెట్‌లోనే మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. మూల్యాంకనం తర్వాత పిల్లలు రాసిన జవాబులు, టీచర్లు మూల్యాంకనం ద్వారా ఇచ్చిన మార్కులను యాప్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో ఎఫ్‌ఏ-1 పరీక్షలను ఈనెల 11 నుంచి నిర్వహిస్తున్నారు. 11నుంచి 13 వరకు ప్రైమరీస్కూల్ విద్యార్థులకు, 11నుంచి 14 వరకు ఆరు నుంచి పదో తరగతుల విద్యార్థులకు ఎఫ్‌ఏ-1 పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో నూతనంగా ముద్రించిన అసెస్‌మెంట్ ఆన్సర్‌షీట్స్‌బుక్‌లెట్స్‌ను ఎస్‌ఈఆర్టీ విభాగం జిల్లాలకు పంపుతోంది. వచ్చిన ఆన్సర్‌షీట్స్‌ను పాఠశాలలకు విద్యాశాఖ, ఎస్ఎస్ఏ శాఖల పర్యవేక్షణలోపాఠశాలలకు చేరుస్తున్నారు. ఈకొత్త పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం తీరుపై ఇప్పటికే టీచర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

జడ్పీలో కారుణ్య నియామకాలు

- 13 మందికి అవకాశం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో బుధవారం 13 మందికి కారుణ్య నియామ కాలు కల్పించారు. జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ శివశంకర్ నియామక ఉత్తర్వులు అందజేశారు. వారు ఆరేళ్లుగా వేచి చూస్తున్నారు. ఎట్టకేలకు నియామకం కల్పించడంతో హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగాలు పొందినవారు వీరే..

ఉద్యోగి పేరు	నియమించిన స్థానం
మౌనిక రాజకుమారి	విడపనకల్లు ఎంపీపీ కార్యాలయం
యశ్వంత్‌నాయక్	అమరాపురం జడ్పీహెచ్ఎస్
స్నేహలత	పేరూరు జడ్పీహెచ్ఎస్
అజయ్‌బాబు	గోరంట్ల జడ్పీహెచ్ఎస్ (బాలురు)
లోకేష్	రాయదుర్గం ఎంపీపీకార్యాలయం
పవన్	లేపాక్షి ఎంపీపీ కార్యాలయం
సాయి జీవన్	పెనుకొండ ఎంపీపీ కార్యాలయం
చౌడేశ్వరి	రామగిరి ఎంపీపీ కార్యాలయం
వెంకటేష్	శెట్టూరు ఎంపీపీ కార్యాలయం
వంశీకృష్ణ	అనంతపురం ఎంపీపీ కార్యాలయం
విశ్వచైతన్య	వేపకుంట జడ్పీహెచ్ఎస్
రాధమ్మ	అనంతపురం, జడ్పీ
సాయిలలిత	అనంతపురం, జడ్పీ

కారుణ్యం చూపని వైసీపీ..!

పెద్దదిక్కును కోల్పోయి రోడ్డున పడినా.. గత వైసీపీ ప్రభుత్వం కనీస కనికరం చూపలేదు. విధుల్లో ఉండగానే ఉద్యోగులు చనిపోవడంతో వారి కుటుంబాలు ఆధారాన్ని కోల్పోయాయి. ఒక్కసారిగా దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. అలాంటి వారికి కారుణ్య నియామకాలు కల్పించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లూ నిరీక్షణ తప్పలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో వారి నిరీక్షణకు తెరపడింది. అర్హతలకు అనుగుణంగా నియామకాలు కల్పించాలని ప్రభుత్వం పలుమార్లు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జడ్పీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించారు. ఖాళీ అయిన జూనియర్ అసిస్టెంట్ స్థానాలను కారుణ్య నియామ కాల ద్వారా భర్తీ చేస్తున్నారు. జిల్లా పరిషత్ పరిధిలో బుధవారం 13 మందికి కారుణ్య నియామకాల కింద జూనియర్ అసిస్టెంట్లుగా అవకాశం కల్పించారు. వారికి స్థానాలను కేటాయించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఇప్పటికే పలు కేటగిరీల కింద ఈ ఏడాది మూడు సార్లుకారుణ్య నియామకాలు చేపట్టారు. చాలామంది ఆఫీస్ సబార్డినేట్లుగా బాధ్యతలు చేపట్టడానికి సుముఖ త చూపకపోవడంతో ప్రస్తుతం ఉన్నవారిలో వారి విద్యార్హత లకు అనుగుణంగా జూనియర్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పిస్తున్నారు. రోస్టర్ మేరకు 13 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ శివశంకర్

వారం రోజుల్లో మరో 11 మందికి ..

జూనియర్ అసిస్టెంట్ల కోటా పూర్తి కావడంతో ఇక సీనియారిటీకి అనుగుణంగా కారుణ్య నియామకాల కోసం వేచి ఉన్నవారిలో మరో 11 మందికి జాబితా సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల్లో నియామక ఉత్తర్వుల జారీకి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఐదేళ్లు నిరీక్షించా



కారుణ్య నియామకం కోసం ఐదేళ్లు నిరీక్షించా. నియామక ఉత్తర్వులు ఇవ్వడంతో ఆనందంగా ఉంది. బాధ్యతగా విధులు నిర్వర్తిస్తా.

-రాధమ్మ, జూనియర్ అసిస్టెంట్

ఎన్నో ఇబ్బందులు పడ్డా..



కారుణ్య నియామకం కోసం ఐదేళ్లు నిరీక్షించా. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు భరించా. నియామకం కల్పించడం ఆనందంగా ఉంది.

-సాయిజీవన్, జూనియర్ అసిస్టెంట్

తల్లిదండ్రుల వద్దకు చేరిన బాలుడు



ఆర్టీసీ క్లర్క్ లక్షుమయ్యతో రిషి

మైదుకూరు రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గుత్తికి చెందిన కావడి సతీష్, రూతుకు కుమారుడు రిషి (12) తల్లిదండ్రులు మందలించడతో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి పారిపోయి మైదుకూరు బస్టాండ్‌కు చేరుకున్నాడు. మంగళవారం రిషి డబ్బులు అడుక్కొంటూ తిరుపతి వెళ్లే బస్సు ఎక్కాడు. అదే బస్సులో ఉన్న ఖాజా తన సెల్‌ఫోన్ పోయిందని, దాన్ని రిషినే తీశాడని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. వారి వెంట ఆర్టీసీ డిపో క్లర్క్ లక్షుమయ్య కూడా వెళ్లాడు. అక్కడ నుంచి ఖాజా తన సెల్‌ఫోన్‌కు పోలీసులతో కాల్ చేయించగా.. అవతలి వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి మీ సెల్‌ఫోన్ తనకు బస్సులో దొరికిందని తెలిపాడు. దీంతో ఖాజా క్షమాపణలు చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆర్టీసీ క్లర్క్ లక్ష్మమయ్య ఆ బాలుడి వద్ద తల్లిదండ్రుల సమాచారం తెలుసుకున్నాడు. వారికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. బాలుడిని పోలీసుల సాయంతో వారి వద్దకు పంపాడు.

రోడ్ల మరమ్మతులకు సవరణ ఉత్తర్వులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఆర్‌అండ్‌బీ, రాష్ట్ర, హైవే రోడ్లు, మేజర్ జిల్లా రోడ్ల మరమ్మతులకు సంబంధించి సవరణ ఉత్తర్వులను ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ బుధవారం విడుదల చేశారు. ఈమేరకు జీఓఆర్టీ నెంబర్ 411 జారీ చేశారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు సంబంధించి అధికారులు అంచనాలు తయారు చేసి ఈఎన్‌సీకి పంపారు. వాటిని సవరిస్తూ, తదుపరి చర్యలకై ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో పామిడి నుంచి వజ్రకరూరు రోడ్డు, కొనకొండ్ల నుంచి ఉరవకొండ రోడ్డు, ఉరవకొండ టౌన్ నుంచి లింక్ రోడ్డు కనెక్టింగ్ కొనకొండ్ల నుంచి ఉరవకొండ రోడ్డు రూ.3.5 కోట్లతో అంచనాలు పంపారు. వీటిని నాబార్డు నిధులతో చేపట్టేందుకు అనుమతులు మంజూరయ్యాయి. దీంతో వీటిని సవరిస్తూ ముస్టూరు నుంచి రామసాగరం, బోరంపల్లి రోడ్డు మరమ్మతులు చేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో మధూడి, రాయాపురం రోడ్డు, బండ్రేపల్లి మీదుగా.. అదే విధంగా ఆర్‌జే రోడ్డు నుంచి జీఎస్ తండా రోడ్డు, హెచ్‌ఆర్ హట్టి మీదుగా.. అగళి నుంచి బొమ్మరసనపల్లి కొండేపల్లి రోడ్డు మీదుగా రూ.2.62 కోట్లతో మరమ్మతు లకు అధికారులు అంచనాలు పంపారు. మొదటి రెండు రోడ్లకు మాత్రమే సవరణ ఉత్తర్వులు జారీ చేశారు. అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

నిధులను పెంచండి: ఎంపీ అంబికా


మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సభ్యులకు ఏడాదికి కేటాయించే నిధులను పెంచడంతోపాటు జీఎస్టీని మినహాయించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం 377 నిబంధనలో భాగంగా ఎంపీ పార్లమెంట్ సమావేశంలో మాట్లాడారు. 2011 నుంచి ప్రతి పార్లమెంట్ సభ్యుడికి ఏడాదికి కేటాయించే (ఎంపీ లాడ్స్) రూ.5 కోట్ల నిధులు ప్రస్తుత రోజుల్లో ద్రవ్యోల్బణం, నిర్మాణ వ్యయాలు, ప్రజా అవసరాల పెరుగుదలతో సరిపోవడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత, రహదారుల లేమి తదితర సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఏడాదికి కేటాయించే రూ.5 కోట్ల నిధులు ప్రాథమిక అవసరాలకే సరిపోవడం లేదని ఆయన కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కేంద్రం అమలు చేస్తున్న ఇతర సంక్షేమ పథకాల తరహాలోనే ఎంపీ నిధుల ద్వారా చేపట్టే పనులకు జీఎస్టీ మినహాయిం పు కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో ప్రతి ఎంపీకి ఏడాదికి రూ.10 కోట్లు నిధులు కేటాయించడంతోపాటు జీఎస్టీని పూర్తిగా మినహాయించా లని విజ్ఞప్తి చేశారు.

సికింద్రాబాద్-మైసూర్ ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి సికింద్రాబాదు- మైసూర్-సికింద్రాబాద్ (వయా గుంతకల్లు) ప్రత్యేక బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాదు-మైసూర్ బైవీక్లీ ప్రత్యేక రైలు (07033) ఈ నెల 8 నుంచి 29 వరకూ సోమ, శుక్రవారాలలో నడపనున్నారు. ఆయా రోజుల్లో సికింద్రాబాదులో రాత్రి 10-10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4 గంటలకు మైసూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (07034) ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకూ బుధ, శని వారాలలో నడుస్తుందన్నారు. ఆయా రోజుల్లో సాయంత్రం 5-20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11 గంటలకు సికింద్రాబాదుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యల్హంక, బెంగళూరు కంటోన్మెంటు, కేఎస్ఆర్ బెంగళూరు, కనిగెరి, మండ్య స్టేషన్ల మీదుగా మైసూరుకు చేరుతుందన్నారు.

మస్కా కొట్టిన మాయగాళ్లు

ఓ వ్యక్తిని ఏమార్చి మూడు తులాల బంగారం కాజేసిన దుండగులు

డీ.హీరేహాళ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సహాయం చేస్తున్నట్లు నటించి ఓ వ్యక్తి నుంచి మూడు తులాల బంగారాన్ని కాజేసిన సంఘటన బుధవారం మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక రాంపురం పట్టణానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ ఆంజనేయులు రాయదుర్గానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ తరుణంలో మండలంలోని పాతహడగలి గ్రామం వద్దకు రాగానే వెనుక వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆంజనేయులును ఆపారు. 'సార్..! ఈ ప్రాంతంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మీ ఒంటి మీద ఉన్న బంగారం మొత్తం తీసి జాగ్రత్తగా ఒక పేపర్‌లో పెట్టుకుని వెళ్లండి' అని చెప్పారు. ఇది నమ్మిన ఆంజనేయులు తన ఒంటి మీద ఉన్న ఒక చైను, రెండు ఉంగరాలను తీశాడు. ఈ సమయంలో ఆంజనేయులుకు సాయం చేస్తున్నట్లు నటించి, ఆ బంగారాన్ని పేపర్లో మడిచి ఆయన ద్విచక్ర వాహనంపై ఉన్న బ్యాగులో ముందువైపు పెట్టి పంపించేశారు. కొంతదూరం వెళ్లిన ఆంజనేయులు అనుమానంతో ఆ పేపర్‌ను విప్పి చూడగా అందులో చిన్న చిన్న రాళ్లగులికలు ఉండటం గమనించాడు. వెంటనే తిరిగి సంఘటనా స్థలానికి వచ్చి చూడగా అక్కడ ఎవరూ లేకపోవడంతో కంగారుపడ్డాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు. మొత్తం మూడు తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు.

ఫ్రీ బస్సుకు చురుగ్గా చర్యలు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు


అధికారులకు సూచనలు చేస్తున్న జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఈ నెల 15 నుంచి కల్పించేందుకు చురుగ్గా చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన ఆర్టీసీ ఇన్‌చార్జ్ ఆర్ఎం శ్రీలక్ష్మి, డీఎం నాగభూపాల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత ప్రయాణం పథకాన్ని మహిళలకు పూర్తి లబ్ధిదాయకంగా మార్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి బస్సు షెడ్యూల్, రూట్ మ్యాపింగ్, టిక్కెట్ విధానం, డిజిటల్ ట్రాకింగ్ వంటి అంశాలపై పూర్తి స్పష్టత ఉండాలన్నారు. అనంతరం బస్టాండుతోపాటు డిపో పరిసరాలను ఆయన సందర్శించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను నడపాలన్నారు. బస్టాండు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 732 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

అమ్మా.. ఇక సెలవ్..!

- హరితా క్షమించు... నా టైం ఇక్కడితో అయిపోయింది..
- రూ.35 వేలకు రూ.1.20 లక్షలు కట్టా.. ఇక కట్టలేను..
- సెంట్రల్ బ్యాంకు ఉద్యోగి ఆవేదన
- అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్య
- బ్యాంకులోనే ఉరి
- అప్పుల వేధింపులు అంటూ సూసైడ్ నోట్


రోదిస్తున్న రవికుమార్ భార్య హరిత, కుటుంబీకులు

'అమ్మా.. ఇక సెలవ్. హరితా నన్ను క్షమించు. నేను బతికి మీకు ఎలాంటి లాభం లేదు. పిల్లల్ని, నిన్ను వదిలి వెళ్లాలంటే మనసు ఒప్పుకోవడం లేదు. నేను చేసుకున్న అప్పులే నా పాలిట శాపం అయ్యాయి. నా టైం ఇక్కడితో అయిపోయింది. రూ.50 వేలు అప్పు తీసుకుంటే... రూ.15 వేలు పట్టుకుని రూ.35 వేలు ఇచ్చారు. ప్రతి నెలా రూ.15,000 ఇచ్చాను. వడ్డీ కడుతూ ఇప్పటి వరకూ రూ.1.20 లక్షలు కట్టాను. ఇంక నా వల్ల కాదు.'

ఇవీ అప్పుల బాధలు, వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక ప్రాణం తీసుకున్న బ్యాంకు ఉద్యోగి రాసుకున్న ఆఖరి మాటలు. రూ.35 వేలు తీసుకుంటే... ఇప్పటి వరకూ రూ.1.20 లక్షలు కట్టాడంటే.. వడ్డీ వ్యాపారులు ఏ స్థాయిలో వసూళ్లు చేశారో చెప్పనక్కర్లేదు.


ఉద్యోగి రవికుమార్ (ఫైల్)

అనంతపురం క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక గుత్తి రోడ్డులోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి రవికుమార్ (40) అప్పుల బాధలు భరించలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బ్యాంకులోనే ఉరేసుకుని, ప్రాణం తీసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలులోని సీ క్యాంపు ప్రాంతానికి చెందిన సంకుల రవికుమార్ కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి స్థానిక వినాయకనగర్‌లో స్థిరపడ్డాడు. భార్య హరిత, పిల్లలు సూర్యతేజ(13), దీక్షిత(11), వీక్షిత (10) ఉన్నారు. 12 ఏళ్లుగా బ్యాంకులో సబ్‌స్టాఫ్(దఫ్తరీ)గా పనిచేస్తుండేవాడు. బుధవారం ఉదయం 9.45 గంటలప్పుడు బ్యాంకుకు వెళ్లాడు. కాసేపు అక్కడి ఉద్యోగులతో మాట్లాడాడు. అంతకుముందు భార్యకు ఫోన్ చేసి మనసు బాగోలేదని చెప్పాడు. తర్వాత 9.50గంటలకు బ్యాంకులోని వాష్‌రూమ్‌కు వెళ్లి కిటికీకి కొత్తగా తెచ్చుకున్న నైలాన్ తాడుతో ఉరివేసుకున్నాడు. వాష్‌రూమ్ తలుపులు తీయకపోవడంతో గుర్తించిన బ్యాంకు సిబ్బంది, ఇంటికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో కార్పెంటర్ ఓపెన్ చేసి చూడ గా... ఉరివేసుకుని, మరణించాడు. సమాచారం అందుకున్న త్రీటౌన్ సీఐ శాంతిలాల్, వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

అధిక వడ్డీ వేధింపులే..

రవికుమార్‌ను అప్పులు, అధిక వడ్డీ వేధింపులే బలి తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. 35 వేలకు ఇప్పటికే రూ.1.20 లక్షలు కట్టాననీ, ఇక కట్టలేనంటూ సూసైడ్ లెటర్‌లో పేర్కొనడం చూస్తేంటే.. వడ్డీలు కట్టడానికి జీతం చాలట్లేదని స్పష్టమవుతోంది. మరికొందరి వద్ద తీసుకున్న అప్పులు కూడా అతడికి భారంగా మారినట్లు స్పష్టమవుతోంది. రవికుమార్ మూడు రోజులపాటు సెలవు తీసుకున్నాడని బ్యాంకు సిబ్బంది ద్వారా తెలుస్తోంది. సెలవు ముగించుకుని వచ్చీ రాగానే... బ్యాంకు ఉద్యోగులు, కుటుంబీకులను ఒకసారి మాట్లడించి, అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. రవికుమార్ మృతదేహాన్ని వాష్‌రూమ్ నుంచీ బయటకు తీయగానే... భార్య హరిత, ఇతర కుటుంబీలు కన్నీరుమున్నీరయ్యారు. తోటి బ్యాంకు ఉద్యోగులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు. కొందరు ఉద్యోగులకు నోట మాట రాలేదు. హరిత ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అధిక వడ్డీలకు అడ్డుకట్ట వేయాలి

అధిక వడ్డీ వేధింపుల కారణంగానే బ్యాంకు ఉద్యోగి రవికుమార్ ఆత్మహత్య చేసుకున్నారని అధిక వడ్డీల వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. రవి మృతదేహాన్ని హరితోపాటు మరికొందరు మార్చురీ వద్ద సందర్శించి, అతడి కుటుంబీకులను ఓదార్చారు. తర్వాత ఆయన మాట్లాడుతూ... నగరంలో వడ్డీ వ్యాపారుల అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. వాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే... ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కాల్‌మనీ కేటుగాళ్లను ప్రభుత్వం, పోలీసులు కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

వేధింపులను అడ్డుకోండి

పేదలను దోచుకుంటున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

అనంతపురం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపుల నుంచి ప్రజలను కాపాడాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల అవగాహన, మైక్రో ఫైనాన్స్ వడ్డీ వ్యాపారుల నుంచి కాపాడాలంటూ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జిల్లా కోశాధికారి చంద్రిక సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుకు రమాదేవితోపాటు ఎల్‌డీఎం నరేష్ రెడ్డి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ వాసుదేవరెడ్డి, బ్యాంకింగ్ అధికారి భ్రమరాంబ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదల అవసరాలను ఆసరా చేసుకుని రుణాలిచ్చిన కొన్ని మైక్రో ఫైనాన్స్ కంపెనీలు అధిక వడ్డీలతో దోచుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీర్చలేక ఒత్తిడికి గురై అనేక మంది ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డ్వాక్రా సంఘాల్లో సభులు రుణాలు పొందాలంటే ఆర్పీలు, పై సిబ్బందికి కమీషన్లు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని, ఈ సంస్కృతిని నిర్మూలించాలని కోరారు. అనంతరం ఎల్‌డీఎం నరేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా రుణాలందిస్తున్నాయన్నారు. సబ్సిడీ రుణాలు, విద్య, ఉపాధి, ఆర్థిక అవసరాలకు తక్కువ వడ్డీలతోనే రుణాలు మంజూరు చేస్తున్నాయని తెలిపారు. మెప్మా పీడీ విశ్వజ్యోతి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యులు ఎవరికీ ఎలాంటి కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా కమీషన్లు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. బ్యాంకింగ్ అధికారిని భ్రమరాంబ మాట్లాడుతూ... ప్రజలకు తక్కువ ప్రీమియంతో ఆరోగ్య, ప్రమాద బీమా పథకం అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ జిల్లాలో మైక్రో ఫైనాన్స్ సంస్థల రుణ ఒత్తిళ్లతో చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఏ షూరిటీ లేకుండా రుణాలు ఇచ్చి, నెల కంతు చెల్లించకపోతే గద్దల్లా ఇళ్ల మీదకు వాలిపోయి వడ్డీవ్యాపారులు వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు దృష్టి సారించి ప్రజలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు శ్యామల, నగర అధ్యక్ష కార్యదర్శులు శంషాద్, అశ్విని, నగర నాయకులు గీత, శైలజ, వహీదా, షర్మాబి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య అంశాలపై దృష్టి పెట్టండి

ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించి, అమలు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వివిధ రీతుల్లో వచ్చిన ఫిర్యాదులపై స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్య పరిష్కరించాలన్నారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. పౌరసరఫరాలు, పీజీఆర్ఎస్, ఐవీఆర్ఎస్, చుక్కల భూముల ప్రక్రియ తదితర అంశాలలో పురోగతి సాధించాలన్నారు. తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు ఎఫ్‌పీ షాపులు తనిఖీ చేసి, నిత్యావసర సరుకులు సరిగా అందేలా చూడాలన్నారు. గుంతకల్లు, ఉరవకొండ, బొమ్మనహాళ్, పామిడి, యల్లనూరు, యాడికి మండలాల్లో రీ ఓపెన్ కేసులున్నాయని, వాటిని సత్వరమే పూర్తి చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

1,571 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,571 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైలు వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువులను ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ బుధవారం పరిశీలించారు. యూరియా 754 మెట్రిక్ టన్నులు, డీఏపీ 407 మెట్రిక్ టన్నులు, 20-20-0-23 రకం ఎరువులు 410 మెట్రిక్ టన్నులు జిల్లాకు సరఫరా అయ్యాయయన్నారు. జేసీ ఆదేశాల మేరకు 402 మెట్రిక్ టన్నుల యూరియా ప్రైవేటు డీలర్లకు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు 352 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన ఎరువులను పలువురు ప్రైవేటు డీలర్లతోపాటు మార్క్‌ఫెడ్‌కు కేటాయించామని వెల్లడించారు.

రేపు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి నేపథ్యంలో ఈనెల 8వతేదీన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. అండర్-19 విభాగంలో బాల, బాలికలకు జిల్లాస్థాయిలో పోటీలు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఉంటాయన్నారు. గెలుపొందిన వారు జోనల్ స్థాయికి ఎంపికవుతారనానరు. వివరాలకు 9966103956, 08554-353223 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బ్రహ్మసముద్రం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):మండలంలోని భైరవాన్‌తిప్ప గ్రామంలో ఓ బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అడ్డుకున్నారు. వివాహం చేస్తున్నారన్న సమాచారంతో ఐసీడీఎస్ సూపర్ వైజర్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, అంగన్‌వాడీ కార్యకర్తలు బాలిక ఇంటికి వెళ్లారు. అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తరువాతనే వివాహం చేయాలని, అతిక్రమించి వివాహం చేస్తే చట్టరీత్యా నేరస్తులవుతారని బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారితో 18 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేస్తామనే అంగీకారపత్రాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామాంజినమ్మ, వీఆర్వో హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి: డీఆర్ఓ



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని నీటి వనరుల ఆక్రమణలను గుర్తించి, చర్యలు తీసుకోవాలని డీఆర్ఓ మలోల ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జిల్లా స్థాయి నిఘా కమిటీ (వాచ్ డాగ్ కమిటీ) సమావేశంలో పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ఆక్రమణదా రులకు నోటీసులు జారీ చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, నీటి వనరులు, ట్యాంక్ బెడ్స్‌లోని ఆక్రమణల విషయంగా అర్బన్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు సమన్వయంతో బృందంగా క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ స్థితిగతులను పరిశీలించాలన్నారు. నీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ 386 ప్రకారం ఇంతకుముందు ఎన్నిచెరువులు, నీటి వనరులు ఆక్రమించారు, వాటిలో ఎన్ని ఆక్రమణలను తొలగించారు తదితర అంశాలకు సంబంధించి సమీక్షించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రిడ్జిపై రాకపోకలు: ఎమ్మెల్యే



అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లి క్రాస్‌లోని పండమేరు పాత బ్రిడ్జిపై గురువారం నుంచి రాకపోకలు పునఃప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడారు. గత ఏడాది అక్టోబరులో భారీ వరదకు బ్రిడ్జి బేరింగులు దెబ్బతిన్నాయని, దీంతో రాకపోకలు నిలుపుదల చేశామని అన్నారు. కేంద్ర రవాణా, రహదారుల శాఖ నిధులు రూ.85 లక్షలు వెచ్చించి, మూడు నెలల్లోనే మరమ్మతులు పూర్తి చేయించామన్నారు.

ఏడు నెలల గర్భిణి ఆత్మహత్య

భర్త మోసం చేశాడని అఘాయిత్యం


మహమ్మద్ వలి, షేక్ షమీమ్ బాను పెళ్లి ఫొటో

గుంతకల్లు/టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోఫియా స్ట్రీట్‌కు చెందిన ఏడు నెలల గర్భిణి షేక్ షమీమ్ బాను (34) బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షమీమ్ బాను పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైంది. తర్వాత ఒంట్లో బాధను భరించలేక స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో ఒక్కతే వెళ్లింది. వైద్యులు ప్రథమ చికిత్స చేస్తుండగా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో వారు ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి షమీమ్ బానును అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నం చేశారు. అంబులెన్సు గుత్తి సమీపంలో వెళ్తుండగా షమీమ్ బాను మృతి చెందారు. దీంతో ఆమె మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమె గత నెల 14న గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వీఆర్వో మహమ్మద్ వలిపై ఫిర్యాదు చేశారు. మాయ మాటలు చెప్పి రెండో వివాహం చేసుకుని గర్భవతిని చేసి, వదిలించుకోవాలని చూస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేశారు. ఇది సాగుతుండగానే షమీమ్ బాను ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలి తండ్రి షేక్ పీర్‌బాషా బుధవారం రాత్రి 9గంటలకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కుమార్తె ఆత్మహత్య విషయంగా మహమ్మద్ వలిపై ఫిర్యాదు చేశాడు. తన కుమార్తెకు మాయ మాటలు చెప్పి రెండో పెళ్లి చేసుకొని గర్భవతిని చేసి వదిలించుకోవాలని చూశాడని, దీంతో తన కుమార్తె మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెలగొండలో హత్య

గుంతకల్లు/టౌన్,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలగొండ గ్రామంలో దాసరి గోవిందు (52)అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవించే దాసరి గోవిందుపై బుధవారం రాత్రి 9గంటల సమయంలో సమీప బంధువైన దాసరి ఓబయ్య కొడవలితో దాడి చేశాడు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుపై వెళ్తున్న గోవిందును అటకాయించిన ఓబయ్య కొడవలితో నరికాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన గోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు రాత్రి నెలగొండ గ్రామానికి తరలివెళ్లారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

నా కూతురు కనిపించడంలేదు..!

ధర్మవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తన కూతురు కనిపించడం లేదని పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కమతం శివయ్య టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. శివయ్య ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు. రెండో కూతురు నందిని డిగ్రీ పూర్తి చేసి ఇంట్లో ఉంటోంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి తను కనిపించడం లేదని శివయ్య ఫిర్యాదులో పేర్కొన్నారని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. కేతిరెడ్డి కాలనీలో ఉంటున్న చంద్రశేఖర్‌రెడ్డిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మత్తు మందు చల్లి గొలుసు చోరీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేట్ బ్యాంకు వీధిలో ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తున్న కుసుమాంబ అనే మహిళపై దుండగులు మత్తు మందు చల్లి, బంగారు గొలుసును తెంచుకువెళ్లారు. వస్తువులను కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు నటించి బుధవారం ఉదయం బురిడీ కొట్టించారు. ఆమెను మాటల్లోకి దింపి, ముఖంపై పౌడర్ చల్లారు. ఆమెకు మైకం కమ్మగానే మెడలో ఉన్న నాలుగు తులాల బంగారం గొలుసును తెంచుకుని ఉడాయించారు. బాధితురాలు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ విజయ్ కుమార్, ఇన్‌చార్జి సీఐ మారుతీ శంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక నవోదయ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి 9.., 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. 2026 ఫిబ్రవరి 7న అర్హత పరీక్ష ఉంటుందన్నారు. సెప్టెంబరు 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాలలో 8, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అధ్యాపక పోస్టులకు..

బుక్కపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కాంట్రాక్టు పద్ధతిపై అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మగ్బుల్ హుస్సేన్ బుధవారం తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్, గణితం సబ్జెక్టు బోధించడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఆయా సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ(55 శాతం మార్కులు)ఉండాలన్నారు. పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 11 సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయా లన్నారు. 12న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం 9160044786, 9618853847కు సంప్రదించాలన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

అనంతపురం జిల్లా : ఆగష్టు 06: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తిరెసిడెన్సీ, కమలా నగర్, DCMS రోడ్, అనంతపురం నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 06, 07 తేదీల్లో రెండు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి నైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. బుధ, గురు రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.





ఎస్కేయూలోని ఆర్ట్స్ విభాగం వెనుక వైపున, పరీక్షల విభాగానికి వెళ్లే దారిలో గుట్టలను తలపిస్తున్న స్ర్కాప్ నిల్వలు

గుట్టలుగా పడేశారు..!

- ఎస్కేయూ క్యాంపస్‌లో ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్న వస్తు సామగ్రి
- వర్షాలకు, ఎండలకు తుప్పు ● వేలం వేయకుండా అధికారుల నిర్లక్ష్యం

అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పాడైపోయిన వస్తు సామగ్రి ఎక్కడ పడితే అక్కడ గుట్టలుగా దర్శనమిస్తోంది. వాటిని ఎప్పటికప్పుడు విక్రయించాల్సిన సదరు అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీనికితోడు వర్సిటీ ఉన్నతాధికారులు కూడా పట్టించుకోవడం లేదు. వీరి నిర్లక్ష్యం కారణంగా వృథా సామగ్రి గుజిరీకి విక్రయించేందుకు కూడా పనికి రాని విధంగా తయారవుతోంది.

తుప్పు పడుతున్నా పట్టించుకోని వైనం..

విశ్వవిద్యాలయంలోని హాస్టళ్లు, కార్యాలయాలు, ఇతరాత్ర వాటిలో మంచాలు, ర్యాక్‌లు, బల్లలు, ప్లాస్టిక్ కుర్చీలు ఇతరత్రా సామగ్రి పాడవంతో వాటిని క్యాంపస్‌లోని బహిరంగ ప్రదేశంలోనే ఎక్కడపడితే అక్కడ పడేశారు. ముఖ్యంగా ఆర్ట్స్ విభాగం వెనుక వైపు, పరీక్షల విభాగానికి వెళ్లే మార్గంలోనూ వదిలేశారు. మరికొన్ని చోట్ల చిందర..వందరగా ప డేశారు. అవన్నీ ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో గుట్టలు..గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. అలా వదిలేసిన ఆ సామగ్రి మరింత దెబ్బతింటోం ది. ఎప్పటికప్పుడు వాటిని వేలం వేసి విక్రయిస్తే వర్సిటీకి కొంతవరకు ఆదాయం సమకూరే వీలుంటుంది. అయితే సంబంధిత అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఆ సామగ్రి నిల్వలు గుట్టలుగా ఉండడంతో విషసర్పాలు అందులోకి చేరుకుంటున్నాయని వర్సిటీ సిబ్బంది అంటున్నారు. ఏళ్ల తరబడి వ్యర్థాలను వదిలేయడంతో ఎండకు ఎండి.. వానకు తడిసి మరింత తుప్పు పడుతున్నాయని పెదవి విరుస్తున్నారు. కాగా ఇటీవల క్యాంపస్‌లో ఎండిన చెట్లను తొలగించి వేలం వేసి విక్రయించినట్లు తెలుస్తోంది. టన్ను రూ.1400లెక్కన విక్రయించినటు సమాచారం. దీంతో వర్సిటీకి దాదాపు రూ.రెండు లక్షల వరకు ఆదాయం సమాకూరినట్లు సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. ఇదే రీతిన సకాలంలో క్యాంపస్‌లో వదిలేసిన వృథా సామగ్రిని విక్రయిస్తే వర్సిటీకి కొంతలో కొంతైనా ఆదాయం సమకూరుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే సం బంధిత అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదని తెలుస్తోంది. దీనికితోడు వర్సిటీ ఉన్నతాధికారులు కూడా ఇందుకు చొరవతీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

త్వరలోనే వేలం వేయిస్తాం

విశ్వవిద్యాలయంలో స్ర్కాప్ నిల్వలు ఉన్న మాట వాస్తవమే. వాటిని విక్రయించేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటాం. ఆమేరకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. కమిటీలోని సభ్యులు విశ్వవిద్యాలయంలో అన్ని విభాగాలు, సెక్షన్లు పరిశీలించి స్ర్కాప్‌ను ఇంకా గుర్తిస్తారు. తర్వాత అంతటినీ వేలం వేసి విక్రయిస్తాం. దీనికితోడు విద్యాలయంలో ఈ బ్యాటరీలు చాలానే ఉన్నాయి. వాటినీ లెక్కించి వేలం వేయిస్తాం.

-రమేష్‌బాబు, రిజిస్ర్టార్, ఎస్కేయూ

చెరువుకట్ట మరమ్మతుకు నిధుల మంజూరు



తెగిన కనగానపల్లి చెరువుకట్ట (ఫైల్)

కనగానపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గత ఏడాది కురిసిన భారీ వర్షానికి మండలకేంద్రంలోని చెరువు కట్ట తెగిపోయిన విషయం తెలిసిందే. చెరువుకట్ట తెగిపోవడంతో నీరంతా వృథాగా పారడంతో పాటు ఆ ఉధృతికి పలు పంటలు, చేపలు కుట్టుకుపోయాయి. దీంతో రైతులకు, మత్స్యకారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత చెరువుకట్టను మరమ్మత్తులు చేయిస్తానని అప్పట్లో గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకూ ప్రస్తుతం డీఎంఎఫ్ గ్రాంట్ ద్వారా రూ.85 లక్షలు మంజూరు చేయించినట్లు టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తారన్నారు. ఇందుకు కృషిచేసిన ఎమ్మెల్యే పరిటాల సునీతకు, కలెక్టర్ చేతన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రపర్వంగా లక్ష్మీనారాయణుల కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని తపోవనం శివశక్తిసాయి ఆలయంలో లక్ష్మీ నారాయణుల కల్యాణోత్సవాన్ని బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. సాయి ట్రస్టు ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయ ఆవరణలో లక్ష్మీనారాయణుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తర్వాత ప్రభుత్వ సర్వజనాస్పత్రి తదితర ప్రాంతాల్లో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, ఆలయ ధర్మకర్త శ్రీరాములు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

'ఉద్యమాలతోనే హక్కులు పొందగలం'



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న నాయకులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాలతోనే స్వేచ్ఛా హక్కులు పొందలమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. కారంచేడు, చుండూరు ఘటనలలో దళిత మృతవీరులను సర్మించుకుంటూ బుధవారం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం సాగిన కారంచేడు, చుండూరు మారణకాండ యావత్ దేశాన్నే నివ్వెర పరిచిందన్నారు. కులవివక్షతపై పోరాటాలు చేసిన అనేకమంది దళితులు అమరులై సమాజానికి స్వేచ్ఛను కల్పించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, బెంజిమెన్, అంజి, కేపీ రాజు, రమేష్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. మండలంలోని మేడాపురం ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వవిద్యార్థులు బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామసమీపంలోని కొండలో దాదాపు వెయ్యి సీతాఫలం మొక్కలను నాటారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఇలాగే మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

'డ్రగ్స్ జోలికి వెళితే.. అంతా నష్టమే'

అనంతపురం క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ జోలికి వెళితే.. అన్ని రకాలా నష్టమేనని, వాటికి దూరంగా ఉండాలని అనంతపురం ఈగల్ సెల్ ఎస్ఐ హనుమంతు సూచించారు. స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని పాపంపేట ప్రాంతంలో ఉన్న దివ్యశ్రీ ఫౌండేషన్ డీ అడిక్షన్ సెంటర్‌ను ఈగల్ సెల్ అధికారుల బృందం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చికిత్స పొందుతున్న వారితో ఎస్ఐ మాట్లాడుతూ... మద్యం, డ్రగ్స్, గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యాలకు బానిసలైన వారికి శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఎన్నోనష్టాలు కలుగుతాయన్నారు. కనుక వాటికి దూరంగా ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో చికిత్స పొందుతున్న వారు తమ జీవితంలో మార్పు తెచ్చుకోడానికి చేస్తున్న ప్రయత్నాలను చూసి, అభినందించారు. సైక్రియాటిస్టు డాక్టర్ సుదర్శన్, డీ-అడిక్షన్ సెంటర్ నిర్వాహకులు రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ భీమ్‌సేన సంఘం సమావేశం

నార్పల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తిక్కయ్యస్వామి ఆశ్రమంలో బుధవారం భారతీయ భీమ్‌సేన సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంఘం వ్యవస్థాపకుడు రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు సాకే ఓబులేసు, జిల్లా ప్రధానకార్యదర్శి మనమల శంకర్ హాజరయ్యారు. ఇందులో సంఘం మండల అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మిని, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.బోయరాజును, జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా మంచాల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికులు ఇబ్రహీం, లత, నహీమ్, శివలక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎంపిక

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేశారు. ప్యాదిండి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సర్వసభ్యసమావేశంలో ఎన్నికల అధికారి సానే రవీంద్రారెడ్డి, పరిశీలకుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్, ముత్యాలప్ప, నాగభూషణ ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా అల్లే వెంకటరాముడు, అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దుర్గాప్రసాద్‌ను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా సాయిరాం, జీవిత, వెంకటేశులు, కార్యదర్శులుగా నాగేంద్రప్రసాద్, హనుమంతు, నవ్యత, సత్యనారాయణను, జిల్లా కౌన్సిలర్లుగా మారెప్ప, రవికుమార్, విజయరాధిక, రామాంజనేయులు, ఓబులేసును, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాసులును ఎంపిక చేశారు.

ఆ జీఓను వెంటనే రద్దు చేయాలి

● వైసీపీ విద్యార్థి విభాగం డిమాండ్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శాపంగా ఉన్న జీఓను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక జెడ్పీ కార్యాలయం ఎదుట కళ్ల నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ.... ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు బయటకు వస్తాయన్న భయంతోనే పాఠశాలల్లోకి ఎవరూ వెళ్లకూడదనే జీవోను విడుదల చేసిందన్నారు. అలాంటి జీఓను ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను నీరుగార్చడమే మంత్రి లోకేష్ లక్ష్యమన్నారు. ప్రభుత్వం ఆ జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగరాధ్యక్షుడు కైలాష్, జిల్లా ప్రధానకార్యదర్శి నిశాంత్‌రెడ్డి, నాయకులు గంగ శివుడు యాదవ్, ఫయాజ్,పులి, కార్తికేయ, రోహిత్, ఆదిల్, జిలాన్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు

గ్రామాల్లో 'మీ సమస్య - మా బాధ్యత'



ఆత్మకూరు మండలం పీ.యాలేరులో అర్జీలు స్వీకరిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట, రాచానపల్లి గ్రామాల్లో మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వేణుగోపాల్, క్లస్టర్ ఇంచార్జి చల్లా జయకృష్ణ హాజరై గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్, తల్లికి వందనం, ఇంటి స్థలాల మంజూరుతో పాటు ఇతరాత్ర సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామస్థులు అర్జీలు ఇచ్చారు. నాయకులు రామాంజనేయులు, సైఫుల్లాఖాన్, పేరంహరి, శ్రీరాములు, బాష, సాంబశివ, చిరంజీవి, దస్తగిరి, భరత్, కృష్ణ, లక్ష్మీదేవి, రామాంజినమ్మ, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

● కనగానపల్లి: మామిళ్లపల్లి, కోనాపురం గ్రామాల్లో బుధవారం మీ సమస్య- మా బాధ్యతను నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, మాజీ ఎంపీపీ ముకుందనాయుడు, ఎంపీడీఓ అనిల్‌కుమార్, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, నాయకులు దేవరాజు, ఓబులపతి, పరిటాల సుబ్రమణ్యం, రవి, బిల్లే దాము, రాజాకృష్ణ, నరేంద్రరెడ్డి, దామోదర్‌రెడ్డి, నారాయణస్వామి, పురుషోత్తం, కేపీ ముత్యాలు రాము గోపాల్, అరుణ, పామాల ముకుంద పాల్గొన్నారు.

● రాప్తాడు: హంపాపురం, గొల్లపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు, అధికారులు మీ సమస్య -మా బాధ్యత నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మరూరు సొసైటీ ఛైర్మన్ గోపాల్, మాజీ కన్వీనర్ నారాయణస్వామి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కిష్టా, క్లస్టర్ ఇన్‌చార్జి రాము, నాయకులు ప్రతాప్, మధు, పార్థసారధి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

● ఆత్మకూరు: పీ. యాలేరు, కొత్తపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు మీసమస్య -మా బాధ్యత నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు , తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి,నాయకులు రాజారమేష్, నాగేంద్ర, కందుల ఓబుల పతి, వెంకటేశులు, సాయినాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఎన్నిక



కేఎన్ఎస్ ప్రసాద్ రెడ్డి, నగరాధ్యక్షుడు



సాకే తిరుపాల్, ప్రధాన కార్యదర్శి

అనంతపురంటౌన్, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక(జేవీవీ) నగర నూతన కమిటీ ఎన్నికైంది. నగరంలోని జేవీవీ జిల్లా కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ సమక్షంలో జరిగిన ఈ ప్రక్రియకు సాకే భాస్కర్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. మొత్తం 25 మందితో నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేఎన్ఎస్ ప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాకే తిరుపాల్, కోశాధికారిగా రామిరెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా డాక్టర్ ప్రసూన, గాంగేనాయక్, అర్జున్ నాయక్, వీరరాజు, ముత్యాలన్న, కార్యదర్శులుగా రామకృష్ణ, ప్రసాద్, నాగరత్నమ్మ, శశికళ, తిప్పేస్వామితో పాటు మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

తల్లి పాలే బిడ్డకు అమృతం

నార్పల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు అమృతమని హెల్త్ సూపర్‌వైజర్ నారాయణమ్మ పేర్కొన్నారు. మండలకంద్రంలోని గౌరవ వీధి-1 అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం నార్పల ప్రాజెక్టు సీడీపీఓ భారతి ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు జరిగాయి. ఇందులో సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. తల్లిపాలలో పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. వాటిని తాపడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు భార్గవి, ప్రమీల, హేమలత, రమాదేవి, రామాంజనమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న చిగురు తిని 26 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

రామగిరి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది గ్రామంలో బోయ ముత్యాలమ్మకు చెందిన 26 గొర్రెలు బుధవారం మొక్కజొన్న చిగురు తి ని మృతి చెందాయి. ఎండిపోయిన మొక్కజొన్న పంట వర్షాలకు చిగురించిం ది. ఆ చిగురును తిన్న గొర్రెలు నాముకు ని మృతి చెందాయి. ఈ విషయంపై టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగ య్య స్పందించి పశువైద్యాధికారులతో మాట్లాడారు. వెంటనే పశువైద్యుడు మౌలాలిసాబ్, సిబ్బంది, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. దాదాపు రూ.2.50లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది. సహాయసహకారాలు అందిస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో బుధవారం వారు విద్యుత్‌శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సెలూన్‌షాపులకు ఉచిత విద్యుత్తు పథకాన్ని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని తెలిపారు. సంఘం నాయకులు సురేంద్ర, వెంకటప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రాచానపల్లి సొసైటీ అధ్యక్షుడిగా పాములరాయి రఘు



పాములరాయి రఘు

అనంతపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచానపల్లి సింగిల్ విండో అధ్యక్షుడిగా పాములరాయి రఘు నియమితులయ్యారు. ఆ మేరకు బుధవారం ప్రభుత్వం జాబితాను ప్రకటించింది. పాములరాయి రఘు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శిగా , క్లస్టర్ ఇన్‌చార్జిగా పనిచేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఈక్రమంలోనే రాచానపల్లి సొసైటీ సింగిల్ విండో అధ్యక్షుడిగా ఆయనకు పార్టీ పెద్దలు అవకాశం కల్పించారు. పదవి దక్కడం పట్ల అతను సంతోషం వ్యక్తంచేశారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థకు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆయన జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ యార్డు ఛైర్మన్ సుధాకర్, మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి చార్జ్ రాగేమురళీ తదితరులు పాల్గొన్నారు.

బీకేఎస్ సొసైటీకి చాకలి కేశన్న..



కేశన్న

బుక్కరాయసముద్రం: బీకేఎస్ సహకార సొసైటీ ఛైర్మన్‌గా మండలకేంద్రానికే చెందిన చాకలి కేశన్నను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కేశన్న మాట్లాడుతూ ఈ పదవి వచ్చేలా సహకారం అందించిన టీడీపీ జోనల్ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ, ఏడీసీసీబీ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి , జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, జిల్లా నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను పార్టీ మండల కన్వీనర్ అశోక్, ఇతర నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ గార్లదిన్నె మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పలు రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ యోగానందరెడ్డితో పలు విషయాలపై చర్చించారు. అక్కడి పరిస్థితులపై జడ్పీ ఛైర్‌పర్సన్ సంతృప్తి వ్యక్తం చేశారు.

శివన్న మృతి తీరనిలోటు: సీపీఎం

అనంతపురం టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) :ఉరవకొండ ప్రాంతంలో సుదీర్ఘకాలం పాటు సీపీఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించిన చాబాల శివన్న మృతికి సీపీఎం సంతాపం వ్యక్తం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ప్రకటనలో వెల్లడించారు. చిన్నపుడే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడైన శివన్న తన తుదిశ్వాస విడిచేవరకూ కమ్యూనిజంలోనే కొనసాగారన్నారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పడంలో శివన్నది ప్రత్యేక శైలి అని కొనియాడారు. అనారోగ్యంతో ఉన్నపటికీ ఆయన ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవాడన్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అభివృద్ధి చెందాలని నిత్యం ఆకాంక్షించేవారని గుర్తు చేసుకున్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని ర్యాలీ



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ప్రజల్లు

రామగిరి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని కోరుతూ మండల కేంద్రంలో అన్ని వర్గాల ప్రజలు బుధవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టిన అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో పేదలకు అనేక సేవలందిస్తున్న ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని అధికారులను కోరారు.

కేంద్ర పథకాలతో పేదలకు లబ్ధి: బీజేపీ

శింగనమల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాల వల్ల పేదలకు ఎంతో లబ్ధి చేకూరిందని, బీజేపీ మండల కన్వీనర్ బొమ్మన ఓబిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జూల్కాకాలువ గ్రామంలో బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి కేంద్రంలో 11 ఏళ్ల బీజేపీ సుపరిపాలనపై ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మన ఓబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలతో పేదలతో పాటు రైతులకు న్యాయం జరుగుతోందన్నారు. నాయకులు ఓబిలేసు యాదవ్, వెంకటయ్య, శ్రీనివాసులు, గుజ్జల యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై నిత్యం పోరాడుతున్నాం: సీపీఐ



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జాఫర్

శింగనమల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సమస్యల పరిష్కారానికి సీపీఐ అనునిత్యం పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని వాసవీ కల్యాణ మండపంలో బుధవారం సీపీఐ నియోజకవర్గ స్థాయి 11వ మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయక కార్యదర్శులు పాళ్యం నారాయణస్వామి, మల్లికార్జున, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ పాల్గొన్నారు. తొలుత స్థానిక రామస్వామి ఆల యం వద్ద సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ మహాసభలు జరిగే చోటుకు వెళ్లారు. అక్కడ జాఫర్ మాట్లాడుతూ.. పేదలు, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిత్యం పోరాడుతోందని అన్నారు. .కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం శింగనమల నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా బుక్కరాయసముద్రం మండలం దండువారిపల్లికి చెందిన తలారి నారాయణస్వామిని మూడోసారి ఎన్నిక చేశారు. అలాగే సహాయ కార్యదర్శులుగా శింగనమలకు చెందిన డీ.చిన్నప్పయాదవ్‌ను, బుక్కరాయసముద్రంలోని సరళాదేవి నగర్‌కు చెందిన మర్రిస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభలో నాయకులు మధు యాదవ్, లక్ష్మీదేవి, పెదయ్య, గంగాధర్, బండి రామకృష్ణ, నేసే మధు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

అనంతపురం అర్బన్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లిలో బుధవారం ఏఓ వెంకట్‌కుమార్ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, రైతులతో కలిసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత పలు పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు వేరుశనగతోపాటు ఇతర పంటలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రస్తుతం పంటలకు తగు మోతాదులో ఎరువులు వేసుకోవాలని సూచించారు. అలాగే ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి వాతావరణ బీమా, ఫసల్ బీమా కోసం బ్యాంక్‌లో రుణం తీసుకోని రైతులు ఈనెల 14వతేదీ వరకు, రుణం తీసుకున్న రైతులు ఈనెలాఖరులోగా ప్రీమియం డబ్బులు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మురళీకృష్ణ, టీడీపీ నాయకులు, రైతులు రాగే మురళీ, చిన్నికృష్ణ, రాజేంద్ర, వెంకటరాముడు, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

నార్పల: మండలంలోని దిగుమర్రి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత మాట్లాడుతూ.. ప్రతిరైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. వేరుశనగ, మొక్క జొన్న పంటల సస్యరక్షణ ఏవిధంగా చేపట్టాలో వివరించారు. కార్యక్రమంలో ఏఓ చెన్నవీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



ఇటుకలపల్లిలోని పొలం పిలుస్తోందిలో ఏఓ, రైతులు

న్యూస్ బాక్స్

అదనపు బస్సుల కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

ఉరవకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నుంచి చిన్నముష్టూరు ఆదర్శ పాఠశాలకు ఒకే ఆర్టీసీ బస్సు ఉందని, అందులో 150 మంది వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నామని, మరో రెండు బస్సులను అదనంగా కేటాయించాలని ఆ పాఠశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు బుధవారం అనంతపురం- గుంతకల్లు రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. వీరి రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు విద్యార్థులకు సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువుల అందజేత

గుంతకల్లు టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తకోట మస్తాన్ పేట-1, బెంచ్‌కొట్టాల-2 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ. 25 వేల విలువైన ఆట వస్తువులు, దుస్తులను ఆ నలుగురు సేవా సమితి సభ్యులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, వన్‌టౌన్ సీఐ బీ మనోహర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మావతి, సువాసిని, శ్రీదేవి, సభ్యులు చక్రపాణి, పురుషోత్తం, అశోక్, రవితేజ, పాల్గొన్నారు.

ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అనాధికార లేఅవుట్లు, ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్-2020 కింద క్రమబద్ధీకరించుకోవడానికి అక్టోబరు 24లోపు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే చివరి అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్య రానివ్వకండి

యాడికి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవకుమార్ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం సమావేశ భవనంలో వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడైనా బోర్ల మరమ్మతులు, నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నదాత అగ్రో ఏజెన్సీస్, కాశీ విశ్వేశ్వర అగ్రో ట్రేడర్స్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి డీ లీనా వసుంధర, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. కాశీ విశ్వేశ్వర అగ్రోట్రేడర్స్‌లో అనుమతులు లేని రూ. 24,206 విలువ చేసే 4.095 మెట్రిక్ టన్నుల యూరియాను నిలుపుదల చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా రషీద్



ఉరవకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా ఉరవకొండకు చెందిన హరున్ రషీద్ ఎన్నికయ్యారు. ఈ నెల 4,5 తేదీల్లో శింగనమలలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీలో ఆయన్ను ఎన్నుకున్నారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ



దుకాణాల వివరాలు ఆరాతీస్తున్న ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్

పామిడి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు బుధవారం తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో వెలసిన వ్యాపార దుకాణాలపై ఆరా తీశారు. పక్కాగా లీజ్ అగ్రిమెంట్, కొలతలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్నది ఒకసారి పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. శిథిలమైన మరుగుదొడ్లను తొలగించి.. కొత్తగా నిర్మించాలని సూచించారు. ఆయన వెంట అనంతపురం, గుంతకల్లు డీఎంలు భూపాల్, గంగాధర్, కంట్రోలర్ గోపాల్ ఉన్నారు.

తల్లిపాల వారోత్సవాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న పీడీ, అంగన్‌వాడీ వర్కర్లు

పామిడి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పామిడి-1 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ నాగమణి బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడీపీఓ భారతి, సూపర్‌వైజర్లు రామలక్ష్మి, లక్ష్మీనారాయణమ్మ, హెల్త్ ఎంపీహెచ్ఏ శివయ్య, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులు ఏర్పాటు చేయాలి

ఉరవకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సులు ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఈడీటీకి బుధవారం వినతి ప్రతాన్ని అందజేశారు. ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు లేక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజేష్, కార్తీక్ అన్నారు.

కారంచేడు అమరవీరులకు నివాళి

గుత్తి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కారంచేడు అమరులకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజనప్రసాద్, బీఎస్పీ నాయకులు రామాంజినేయులు, కొండయ్య, కేవీపీఎస్ నాయకులు మల్లికార్జున, జనసేన నాయకులు ఓబలేసు, రామాంజినేయులు, రాజేష్ పాల్గొన్నారు.

11 నుంచి నీటి కార్మికుల సమ్మెబాట

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తమకు బకాయి ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని ఈనెల 11 నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు శ్రీసత్యసాయి నీటి పథకం కార్మికులు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ భాస్కర్‌కు సమ్మె నోటీసును బుధవారం అందజేశారు. పథకం సక్రమంగా అమలయ్యేందుకు పూర్తి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

ట్రాన్స్‌కో నిర్లక్ష్యం

- పాత స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు
- వీధిలైట్లు అమర్చకుండా వదిలేసిన సిబ్బంది
- రెండునెలలుగా అంధకారంలో ఎస్సీ కాలనీలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని విద్యుత్ అధికారులు



పాత స్తంభానికే ఉన్న వీధిలైట్

పుట్లూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో తక్కళ్లపల్లి, నారాయణరెడ్డిపల్లి, శనగలగూడూరు, చాలవేముల, కడవకల్లు తదితర గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. కొత్త స్తంభాలకు ప్రధాన విద్యుత్ తీగలు, ఇళ్లకు సరఫరా చేసే తీగలను మాత్రమే ఏర్పాటు చేసి .. వీధి లైట్లను మాత్రం పాత స్తంభాలకు అలాగే వదిలేశారు. దీంతో రెండు నెలలుగా ఎస్సీ కాలనీలు అంధకారంలో ఉంటున్నాయి. ఈ సమస్యను పలుమార్లు విద్యుత్, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయాకాలనీల వాసులు వాపోతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం: శివప్రసాద్, ఈఓఆర్‌డీ

ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి నూతన స్తంభాలకు వీధిలైట్లను ఏర్పాటు చేస్తాం. ఇంకా ఏ గ్రామాల్లో పనులు చేస్తున్నారో విచారించి మొత్తం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

త్వరలో చేస్తాం: పెద్దయ్య, ట్రాన్స్‌కో కాంట్రాక్టర్

పాత స్తంభాల స్థానాల్లో ఏర్పాటు చేసిన కొత్త వాటికి వీధిలైట్లను త్వరలోనే ఏర్పాటు చేస్తాం. కొత్త గా ఏర్పాటు చేసే స్తంభాలకు వీధిలైట్లను పంచాయతీ నిధులతో ఏర్పాటుచేసుకోవాలి. మాకు సంబంధం లేదు.

మురుగు కాలువలు నిర్మించాలని ధర్నా

గుంతకల్లుటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డులోని తిలక్‌నగర్ కాలనీలో మురుగు కాలువలు నిర్మించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు, ఆ కాలనీ వాసులు బుధవారం ధర్నా నిర్వహించారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి తిలక్‌నగర్ కాలనీలోని మేధావి స్కూల్ లైన్‌లో పలు ఇళ్లలోకి వర్షం నీరు చేరిందన్నారు. దీంతో నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రికల్ వస్తువులు పనికి రాకుండా పోయాయన్నారు. ఓ కిరాణా షాపులో రూ. లక్ష విలువచేసే సరుకులన్నీ తడిసిపోయాయన్నారు. సరైన మురుగు కాలువలు లేకపోవడంతో ఇలా జరిగిందని, నష్టపోయిన బాధితులకు నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు కసాపురం రమేష్, వైటీసీ రమేష్, సురేంద్ర, వంశీ పాల్గొన్నారు.

9న బొలికొండ రంగనాథస్వామి కల్యాణం

గుత్తిరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువులో బొలికొండ రంగనాథస్వామి కల్యాణాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శోభా ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు సాయంత్రం గ్రామోత్సవం, పల్లకి ఊరేగింపు, ఊంజల సేవ నిర్వహిస్తామన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నేత జగదీష్

గుత్తి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో రాష్ట్ర ప్రజలపై మరింత ఆర్థిక భారాన్ని మోపేందుకు యత్నిస్తున్నాయని, ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీ జగదీష్ డిమాండ్ చేశారు. స్థానిక నిజామీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సీపీఐ మండల స్థాయి మహాసభలో ఆయన మాట్లాడారు. నియోజవర్గంలో చెరువులను హంద్రీ జలాలతో నింపాలన్నారు. ముందుగా స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహం నుంచి నిజామీ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి రామదాస్ పాల్గొన్నారు.

అనాథపిల్లలకు అన్నదానం



చిన్నారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడిపత్రి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామసమీపంలోని శ్రీ రమణ మహర్షి అనాథ ఆశ్రమంలోని 120 మంది చిన్నారులకు పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన నవీన్ బుధవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అతని స్నేహితులు నరేష్, పవన్, ప్రవీణ్, వేణు, షరీఫ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



చెక్‌లు అందుకున్న విద్యార్థులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు రాజ్ ఫౌండేషన్ బుధవారం మెరిట్‌స్కాలర్ షిప్‌లను అందజేసింది. విద్యార్థులు బోయలక్ష్మి, షేక్ నజియా, షేక్ షహీనా, మౌనికకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున, అఫ్రిన్‌కు రూ. ఐదు వేల చెక్‌ను అందజేసింది. ఇందులో రాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ గోపాల్‌నాయుడు, వైస్‌ఛైర్మన్ ఆర్‌కే నాయుడు, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి రామ పుల్లయ్య, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ఆ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత



స్థల పత్రాలు, నగదు అందజేస్తున్న నాగార్జునరెడ్డి

తాడిపత్రి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రజక వృత్తి చేసుకుంటున్న రంగనాయకులు వ్యసనాలకు బానిసై విపరీతమైన అప్పులు చేశాడు. దీంతో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోయింది. అతనికి టీఎస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇప్పించడంతో అతనిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం వ్యసనాలకు దూరంగా ఉండి.. మంచి వృత్తి చేసుకొంటున్నాడు. ఆ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండాలని ఆ ట్రస్ట్ ఛైర్మన్ తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి విశాల్‌మార్ట్ ఎదురుగా ఉన్న రూ.ఆరు లక్షలు విలువజేసే ప్లాట్‌ను అతని పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారు. ఇంటి నిర్మాణం కోసం రూ.లక్షను బుధవారం అందజేశారు.

ఆలయ కమిటీ ఏకగ్రీవం



నూతన కమిటీ సభ్యులు

రాయదుర్గం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌లోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా టంకశాల హనుమంతు, ఉపాధ్యక్షులుగా బండ శివప్రసాద్, రమేష్‌శెట్టి, సెక్రెటరీగా సిద్ధేశ్వర, జాయింట్ సెక్రెటరీగా అరవా శ్రీనివాసులు, ఆర్ రాజశేఖర్, జాయింట్ ట్రెజరర్‌గా చిదానంద, చుంచుల మార్కండేయులను ఎన్నుకున్నారు.

ఘనంగా గుర్రప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పుట్లూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో గుర్రప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. ముందుగా స్వామివారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కేతిరెడ్డి పెద్దారెడ్డి కార్యక్రమాన్ని అడ్డుకుంటాం

తాడిపత్రి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు రీకాల్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తే దాన్ని అడ్డుకుంటామని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ షెక్షావలి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి నివాసంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకులు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించుకున్నా తమకు అభ్యంతరం లేదని, కానీ పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గానీ, అతని కుటుంబ సభ్యుల సహకారంతో గానీ ఏ కార్యక్రమం చేపట్టినా దాన్ని అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. ఎవ్వైనా కార్యక్రమంలో పెద్దారెడ్డి పాల్గొంటే.. ఆయన వల్ల నష్టపోయిన బాధితులు చేసే దాడులతో తమకు ఎలాంటి సంబంధమూ ఉండదని తెలిపారు.ఈ సమావేశంలో కౌన్సిలర్లు విజయ్‌కుమార్, మల్లికార్జున, నాయకులు మధు, రవి, సూరి, నరేంద్రనాయుడు, జక్కా రమేష్, రంగనాయకులు పాల్గొన్నారు.

కేసు నమోదు

బొమ్మనహాళ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, గురుస్వామి, వెంకటనారాయణ తన భూమి హద్దులు చెడిపి.. భూమి సాగుకు నీళ్ల మళ్లించడమే కాకుండా బెదిరిస్తున్నారని అదే గ్రామానికి చెందిన రాజమ్మ ఎస్ఐ నబీరసూల్‌కు బుధవారం ఫిర్యాదు చేసింది. దీంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మాముడూరులో దొంగల బీభత్సం



బాధితుడు భూతప్ప

బ్రహ్మసముద్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాముడూరు గ్రామానికి చెందిన భూతప్ప.. బుధవారం తన పొలంలో ఉండగా దొంగలు దాడి చేశారు. అతని కంట్లో కారం కొట్టి.. అతని వద్ద ఉన్న రూ.30వేలు లాక్కొని పారిపోయారు. ఎంతో కాలం నుంచి పొదుపు చేసుకున్న పింఛన్ డబ్బులు ఎత్తుకెళ్లారని భూతప్ప వాపోయాడు. ఈ మేరకు పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశాడు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంజీవనగర్ సమీపంలో ముళ్లపొదల్లో బుధవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. వారి వద్ద ఉన్న రూ.40,600 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు.

ఇరువర్గాలకు డీఎస్పీ కౌన్సెలింగ్

పుట్లూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం గ్రామంలో మురికినీటి విషయంలో మూడురోజుల క్రితం ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. దీంతో వారికి బుధవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇలాగే గొడవపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిటోనేటర్ పేలి కూలీకి గాయాలు

గుంతకల్లు/టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోఫియా వీధిలో బుధవారం సాయంత్రం డిటోనైటర్ పేలి ముస్తాఫా అనే కూలీ గాయపడ్డాడు. సోఫియా వీధిలో కొన్ని రోజులుగా పైప్‌లైన్ పనులు చేస్తున్నారు. మధ్యలో రాయి అడ్డురావడంతో వాటిని పేల్చేందుకు మూడు డిటోనేటర్లు పెట్టారు. అందులో రెండు పేలగా, ఒకటి పేలలేదు. దాన్ని చూసేందుకు ముస్తఫా వెళ్లగా ఒక్కసారిగా ఆ డిటోనేటర్ పేలింది. దీంతో అతను స్వల్పంగా గాయపడ్డాడు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు.


దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి



బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కుందుర్పి మండలంలోని ఎర్లచింత గ్రామంలో వీరారెడ్డి, అతని వర్గీయులు మంగళవారం దాడి చేయడంతో అదే గ్రామానికి చెందిన గంగ, లక్ష్మీ, శ్రీనివాసులు, నన్న తిమ్మప్ప, ఈరన్న గాయపడ్డారు. కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి బుధవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. వీరారెడ్డి పై 307, 302 సెక్షన్‌లో కేసు పెట్టాలని, అతనిపై చర్యలు తీసుకోకుంటే ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని అన్నారు. వడ్డెర్లపై దాడి చేస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, ఉపాధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

ఉరవకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఈనెల 4, 5 తేదీల్లో సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అమృత, అంజిలి, అనీషా, వైషాలీ, భవ్య, అంజిలి, సఫీయా, సరిత జిల్లా జట్టు తరఫున ఆడారు. ఈ జట్టు రన్నరప్‌గా నిలిచింది. జిల్లాస్థాయి యోగాసానాల పోటీల్లో మోక్షిత, మోహిత ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరచిన ఈ విద్యార్థులను హెచ్‌ఎం రాజేశ్వరి, పీడీ మారుతీప్రసాద్ బుధవారం అభినందించారు.

కుట్టుమిషన్ల పంపిణీ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక విక్టరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వంద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి బుధవారం అందజేశారు. ఇందులో ఆ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ విజయ్‌కుమారి, తహసీల్దార్ రమాదేవి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, డాక్టర్ పత్తి హిమబిందు, సాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్, జడ్పీటీసీ కదిరప్ప పాల్గొన్నారు.

నిండుకుండలా శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు

కణేకల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాలకు రిజర్వాయర్‌గా ఉపయోగపడుతున్న శ్రీచిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు నిండుకుండలా ఉంది. తుంగభద్రడ్యాంలో హెచ్చెల్సీకి 23,655 క్యూసెక్కులు నీరు విడుదల అవుతుండగా ఆంధ్ర సరిహద్దున 1,915 క్యూసెక్కుల నీరు వస్తున్నాయి. ఈ నీరంతా హెచ్చెల్సీ కాలువ ద్వారా శ్రీచిక్కణ్ణేశ్వర వడియార్ చెరువుకు చేరుతోంది.

2,380 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం ఇన్‌ఫ్లో 2,420 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 2,380 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.806 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

సీపీఐ సీనియర్ నేత శివన్న మృతి



ఉరవకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు హోతూరు శివన్న(73) బుధవారం అనారోగ్యంతో మరణించాడు. వజ్రకరూరు మండలం హోతూరు ఇతని జన్మస్థలం. ఇతను సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా, రైతు సంఘం రాష్ట్ర నాయకుడిగా సేవలు అందించారు. ఆయన భౌతికకాయానికి పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా జయరామిరెడ్డి



అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

తాడిపత్రి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపల్లి ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపరేట్ సొసైటీ అధ్యక్షుడిగా బాణా జయరామిరెడ్డిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సబ్‌డివిజన్ కో-ఆపరేట్ అధికారి నాగరాజు తెలిపారు. దీంతో జయరామిరెడ్డిని జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు జగన్నాథరెడ్డి, సర్పంచు యుగంధర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి సన్మానించారు.